విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల నుండి పెన్ సత్తా దినపత్రికలో పని చేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజక వర్గ ఇన్‌ఛార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
సెల్ : 98853 15759

RNI No.APTEL/2023/87729
# పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



అనకాపల్లి సంపుటి : 3 సంచిక : 344 | 21 - 5 - 2025 బుధవారం | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ పేజీలు : 8 వెల : 3.00

# కాల్పుల విరమణపై అమెరికాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

## - పార్లమెంటరీ ప్యానెల్‌కు తెలిపిన కేంద్రం



**న్యూ ఢిల్లీ :** పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ గురించి అమెరికాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని శశిధరూర్ నేతృత్వంలో విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ ప్యానల్‌కు కేంద్రం తెలిపింది. ఈ కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదని కూడా స్పష్టం చేసింది. వివిధ పార్టీలకు చెందిన 23 మంది సభ్యులు ఉన్న ప్యానెల్ తో కేంద్ర ప్రభుత్వం తరపున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఇతర అధికారులు సమావేశమయ్యారు. ప్యానెల్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మిస్రి, అధికారులు సమాధానం ఇచ్చారు. భారత్ – పాకిస్తాన్ కాల్పుల విరమణ ప్రకటించక ముందే అమెరికా అధ్యక్షులు ట్రంప్ మొదటగా ఈ విషయాన్ని ఎలా ప్రకటించారో వివరణ ఇవ్వాలని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ కోరారు. దీనికి ప్రభుత్వంపై విధంగా సమాధానం ఇచ్చింది. అమెరికా అధికారులతో చర్చలు ఒక సాధారణ ప్రక్రియలో భాగమని చెప్పారు. రష్యా – ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ జోక్యం చేసుకోవడంతో సమానంగా దీన్ని చూడాలని, ఇతర దేశాలు కూడా భారత్ – పాక్‌పై ఇదే విధంగా స్పందించడం సహజమని అధికారులు వివరించారు. మూడో పక్షం మధ్యవర్తిత్వం ఉండకూడదనే విధానం నుంచి భారత్ తప్పుకోలేదని వివరించారు. దాడుల గురించి ముందుగానే పాకిస్తాన్‌కు సమాచారం ఇచ్చారనే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కూడా మిస్రి, అతని బృందం ఖండించింది. మొదటి దాడి తరువాతే ఆపరేషన్ సిందూర్ గురించి భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాకిస్తాన్‌తో మాట్లాడారని తెలిపారు. ఇటీవల కాలంలో పాకిస్తాన్ ప్రోత్సహించే ఉగ్రవాద కార్యకలాపాలు భారత్ లో పెరిగాయని మిస్రి ప్యానెల్‌కు వివరించారు. గత ఏడాదిలో 24 ఉగ్రదాడులు జరిగాయిని, ఇందులో 24 మంది భద్రతా సిబ్బంది, 30 మందికి పైగా సాధారణ ప్రజలు మరణించారని మిస్రి చెప్పారు. సమావేశం తరువాత శశి థరూర్ విలేకరులతో మాట్లాడుతూ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మిస్రి, అధికారులు సంతృప్తికరంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న మిస్రికి ప్యానెల్ సంఘీ భావం తెలిపినట్లు చెప్పారు. మిస్రికి సంఘీ భావంగా ఒక తీర్మానం ప్రవేశపెట్టాలనుకున్నా, వద్దని మిస్రి అభ్యర్థించారని థరూర్ విలేకరులకు తెలిపారు.

# భూ కేటాయింపులకు కేబినెట్ ఆమోదం





**అమరావతి, మే 20 (పెన్ సత్తా):** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు భూ కేటాయింపులకు ఈ కేబినెట్ ఆమోదించింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఏపీఐఐసీకి ఉచితంగా 615 ఎకరాల భూ కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి భూ కేటాయింపు చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. ఇక, సత్యసాయి జిల్లా తాడిమర్రిలో ఆదాని పవర్‌కు 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు భూమి కేటాయించింది. కడప జిల్లాలోని కొండాపురంలో 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు అదానీ పవర్‌కు భూ కేటాయించగా, ఎకరా 5 లక్షల రూపాయల చొప్పున భూ కేటాయింపునకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఇక, 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామక నిర్ణయానికి ర్యాటి ఫై చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయాన్ని ఏపీ కి తరలించే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీలోని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు స్టడీ సెంటర్ల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకీ అనుమతి ఇచ్చింది. అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా లీగల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, ఇతర సరుకులు ఇచ్చే ప్రతిపాదన పై కేబినెట్ లో చర్చ సాగింది. మరో వైపు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయించేలా జీవోఎం చేసిన సిఫార్సుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ లెదర్ ఫుట్ వేర్ పాలసీ 4.0 కి పెట్టు బడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదించిన 11 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులకు రూ.30 వేల కోట్ల వరకూ పెట్టుబడులు, 35 వేల ఉద్యోగాల కల్పనకు ఏపి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# మనకు అన్యాయం చేసిన వారికి సినిమా ఏ జగన్

## - కొనసాగుతున్న జగన్ బెదిరింపుల పర్వం



**తాడేపల్లి, మే 20 (పెన్ సత్తా):** కూటమి ప్రభుత్వ, అధికారులు వైసిపి నాయకులపై అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి కానీ, మీరు వారి పేర్లను ఏ పుస్తకంలో నైనా రాసుకోండి. అన్యాయాలు చేసిన వారికి డీటీఎస్ సినిమాలు చూపిస్తాం అంటూ బెదిరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి. వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమావేశమైన జగన్ సమావేశంలో మాట్లాడుతూ కూటమి సర్కార్, అధికారులు, పోలీసులకు సీరియస్‌గా తనదైన స్టైల్‌లో మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు, కేసులకు, జైళ్లకూ భయపడకూడదు, అలా అయితేనే రాజకీయాలు చేయగలం అని చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు అలా ఉన్నాయి అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని పట్ట పగలే ఖూనీచేస్తున్నారని దుయ్యబట్టారు వైఎస్ జగన్. తిరువూరులో సంఖ్యాబలం లేని చోటకూడా టీడీపీ పోటీకి ప్రయత్నం చేస్తోందన్నారు. మెజార్టీ వైసీపీ ఉందంటే ఎన్నికను ఆపుతున్నారని, వైసీపీ వాళ్లని అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ వాళ్లని బరితెగించి వ్యహరించేలా రోడ్డు పై విడిచిపెడుతున్నారన్నారని, కానీ, రేపు కచ్చితంగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక మనకూ టైం వస్తుంది, అన్యాయాలు చేసిన ఒక్కొక్కరికి పేరు పేరున సినిమాలు చూపిస్తాం, రిటైర్డ్ అయిన వారిని కూడా లాక్కుని వస్తాం, దేశం విడిచిపెట్టి పారిపోయినా సరే వాళ్ళను వెనక్కి రప్పిస్తాం, ఒక్కొక్కరికి సినిమాలు చూపిస్తాం అని బహిరంగంగా హెచ్చరించారు. ఆఖరికి కూటమి ప్రభుత్వం మహిళలు అని చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు వైఎస్ జగన్. ఒక కేసులో బెయిల్ వస్తుంది, అది రాగానే మరో కేసు పెడుతున్నారు, ఇలా కేసులు మీదు కేసులు పెడుతున్నారని, వల్లభనేని వంశీ విషయంలో ఇలాగే చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా దళితుడు,అమాయకుడు అయిన నందిగం సురేష్ విషయంలోను ఇలాగే దారుణాలు చేస్తున్నారని, సుమారు నెలన్నరకు పైగా జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత ఇప్పుడు మళ్లీ కేసుపెట్టి జైల్లో వేశారు అంటూ మండిపడ్డారు.

# రోహింగ్యాలతో అంతర్గత భద్రతకు ప్రమాదం : పవన్




**అమరావతి, మే 20 (పెన్ సత్తా):** రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం, అంతర్గత భద్రతకు ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. వారు స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడంలో వ్యవస్థలోని కొంతమంది పాత్ర ఉందని చెప్పారు. సరిహద్దుల్లో సైనికుల అప్రమత్తత కంటే మిన్నగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదుల సున్నితమైన లక్ష్యాల్లో ఉన్నాయని అన్నారు. మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. తీరంలో కొత్త వ్యక్తుల కదలికల పై నిఘా ఉంచాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. సరిహద్దుల్లో సైనికులు ఎంత భద్రంగా దేశాన్ని రక్షిస్తున్నారో, దేశం లోపల అంతర్గత భద్రతలో పోలీసు శాఖ కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండటం కీలకమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదుల సున్నితమైన లక్ష్యమని గతంలో జరిగిన కిరాతక దాడుల్లో తేలిందని చెప్పారు. కుంకీ ఏనుగుల ద్వారా మదపు టేనుగుల గుంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని పవన్ కళ్యాణ్ అన్నారు. సరిహద్దుల్లో సైనికులు ఎంత భద్రంగా దేశాన్ని రక్షిస్తున్నారో, దేశం లోపల అంతర్గత భద్రతలో పోలీసు శాఖ కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండటం కీలకమని సూచించారు. ఈ విషయం పైనే ఏపీ పోలీసులను, పరిపాలన సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తూ లేఖ రాశానని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదుల సున్నితమైన లక్ష్యమని గతంలో జరిగిన కిరాతక దాడుల్లో తేలిందని చెప్పారు. కోయంబత్తూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులను తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని అన్నారు. సరిహద్దుల్లో భద్రతా సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉంటారో, రాష్ట్ర పోలీసులు కూడా అంతర్గత భద్రత పై అంతే సీరియస్‌గా దృష్టి సారించాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

# రూ. 6,200 కోట్ల కుంభకోణంలో యుసిఒ. బ్యాంక్ మాజీ సిఎండి

## - మనీలాండరింగ్ ఆరోపణలతో యుసిఒ బ్యాంక్ మాజీ సిఎండి అరెస్ట్




**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ ఆరోపణలతో యుసిఒ బ్యాంక్ మాజీ సిఎండి సుబోధ్ కుమార్ గోయెల్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలిపింది. కొల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి రూ. 6,200 కోట్లకు పైగా బ్యాంకు రుణాలను మళ్లించినట్లు పేర్కొంది. ఈ నెల 16 న న్యూ ఢిల్లీలోని తన నివాసంలో గోయెల్‌ను ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 17 న కోల్‌కతాలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం కోర్టులో హాజరుపరచినట్లు, 21న వరకు కస్టడీకి అప్పగించినట్లు ఫెడరల్ ప్రోబ్ ఏజెన్సీ ఓ ప్రకటనలో తెలిపింది. గోయెల్ సిఎండిగా ఉన్న కాలంలో, కొల్‌కతాకు చెందిన సిఎస్‌పిఎల్ కంపెనీకి రూ.6,210.72 కోట్ల నిధులు మళ్లించినట్లు ఇడి తెలిపింది. దీనికి బదులుగా నగదు, స్థిరాస్తులు, ఖరీదైన వస్తువుల రూపంలో గోయెల్ పొందుకున్నట్లు విచారణలో తేలిందని వెల్లడించింది. సిఎస్‌పిఎల్ ప్రధాన ప్రమోటర్ అయిన సంజరు సురేఖను గతేడాది డిసెంబర్‌లో ఇడి అరెస్టు చేసింది.

# ముంబై సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశంలో సీఎం రమేష్





**ముంబై :** ముంబై నగరంలో జరిగిన రాజ్యాంగ 129 సవరణ బిల్లు, 2024 పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశానికి, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లు, 2024 సమావేశానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, కమిటీ సభ్యులతో కలిసి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భూతాలు సృష్టికర్తలనూ ధిక్కరిస్తాయి

'ప్రజల జ్ఞాపకశక్తి చాలా స్వల్పం' అనే మాట మనం తరచూ వింటూంటాం. దీన్నొక బలహీనతగా రాజకీయ నాయకులు భావిస్తారు. ప్రజలు దీన్ని అధిగమించలేరనీ, అందుకే పాత వాగ్దానాలను విస్మరిస్తున్నా, గతంలో చేసిన ఘోర తప్పులను చేయలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నా నెగ్గుకు రాగలుగుతున్నామనీ నమ్ముతారు. నిత్యజీవన సమరంలో ఏదోరకంగా బండి నెట్టుకు రావటానికే శక్తులన్నీ కూడదీసుకుంటున్న సగటు మనిషి విస్తృత సమాజంలో జరిగే పరిణామాలను ఒక లెక్క ప్రకారం గుర్తుపెట్టుకోలేడు. వాటి ఆధారంగా మంచి చెడులపై అన్ని సందర్భాల్లోనూ స్పందించలేడు. బహుళపార్టీ ప్రజాస్వామ్యంలో సైతం కపటత్వానికీ, మోసానికీ, వాగ్దాన భంగతకూ ఈ బలహీనతే ప్రధాన కారణం. సాధ్యమైనంతవరకూ సాధారణ ప్రజలను వర్తమానంలోనే ఉంచి చరిత్ర స్పృహలేకుండా చేయటంలోనే దారుణాలన్నీ విస్మరణకు గురవుతాయి. వాటికి కారణమైన రాజకీయ పార్టీలూ, వ్యక్తులూ పాపంలో తమకు వాటా లేదన్నట్లుగా వ్యవహరిస్తూ పెద్దరికాన్ని ప్రదర్శిస్తారు. పహల్గాం దారుణం తర్వాత భారత్-పాక్ మధ్య సాగిన సైనిక దాడులు, ప్రతిదాడులను ప్రస్తావిస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయి. భారత్-పాక్ మధ్య నెలకొన్న వైషమ్యాల్లో అమెరికా పాత్ర లేనేలేదనీ వాటితో తమకున్న సంబంధం ఏమిటనీ ప్రశ్నించారు. మే 9న ఈ ప్రకటన చేసి 10వ తేదీకల్లా మాటమార్చి భారత్%-%పాక్ మధ్య కాల్పుల విరమణకు తమ మధ్యవర్తిత్వమే కారణమని చెప్పుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అయితే భారత్-పాక్‌ల మధ్య సైనిక సంఘర్షణలను ఆపివేసి అణుయుద్ధ ప్రమాదం నుంచి ప్రపంచాన్నే రక్షించానని ఆర్భాటంగా ప్రకటించుకున్నారు. మొత్తం వ్యవహారంలో అమెరికా పాత్ర ఎంతో ఇప్పుడే చెప్పలేం. కాలం గడిస్తేనే నిజాలు వెలుగులోకి వస్తాయి. యుద్ధ సమయాల్లో ప్రభుత్వాలు అసలు విషయాలన్నిటినీ చెప్పవు. పాక్షిక సత్యాలనే చెబుతాయి. విజయగాథలనే ఎక్కువగా వినిపిస్తాయి. వైఫల్యాలను విస్మరిస్తాయి. తీసుకున్న నిర్ణయాలను సమర్థించుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తాయి. నిష్పాక్షికంగా చరిత్రను పరిశీలిస్తే భారత్%-%పాక్ మధ్య సంఘర్షణలకు దోహదం చేస్తున్న ప్రతివిషయంలోనూ అమెరికా పాత్ర గణనీయంగానే కనపడుతుంది. ఇస్లామిక్ తీవ్రవాదాన్నే తీసుకుంటే అమెరికా నిర్వహించిన పాత్రను తక్కువచేసి చూడలేం. 1980లకు ముందు కూడా భారత ఉపఖండంలో మతతత్వాలు ఉన్నాయి. హిందూ-ముస్లింల మధ్య సంఘర్షణలకు లక్షలమంది బలైపోయారు. ముస్లింలను ప్రత్యేక జాతిగా పేర్కొంటూ వారి కోసం పాకిస్థాన్ ఏర్పడాలనే వాదమూ, హిందువుల ఆధిపత్యమే చెల్లుబాటు కావాలనే సిద్ధాంతమూ అనేక రూపాల్లో వ్యక్తమై విపరీత సంఘర్షణ వాతావరణాన్ని సృష్టించింది. దీన్ని అతికష్టం మీద అధిగమించి భారత్‌లో లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచగలిగారు. మతప్రాతిపదికగా పాకిస్థాన్ దేశంగా ఏర్పడినా లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరుచుకోలేక తొలి నుంచీ సంక్షోభాల్లో, నియంతృత్వాల్లో కూరుకుపోయింది. కశ్మీర్ సమస్యపై 1980ల వరకూ భారత్-పాక్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా ఇస్లామిక్ తీవ్రవాదం వ్యవస్థీకృతంగా మారి, విపరీత సిద్ధాంత ప్రచారంతో, టెర్రరిస్టు చర్యలతో పెనుసమస్యగా పరిణమించలేదు. 1979లో ఆఫ్ఘానిస్థాన్‌లో రష్యను సేనల ప్రవేశంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమెరికా-రష్యాల మధ్య 1945 నుంచి కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్) అప్పటి నుంచి కీలకమలుపు తిరిగింది. రష్యను సేనలను ఆఫ్ఘాన్ నుంచి పారదోలటానికి అమెరికా అనుసరించిన వ్యూహం, చేపట్టిన చర్యలు ప్రపంచచరిత్రనే రక్తసిక్తం చేశాయి. ఆల్‌ఖయదా, ముజాహిద్దీన్, తాలిబాన్ లాంటివే కాదు ఇంకా వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తూ అనేక దేశాలను కుదిపివేస్తున్న టెర్రరిస్టు ముఠాలన్నీ అమెరికా ఆఫ్ఘాన్ వ్యూహం నుంచే ప్రాణం పోసుకున్నాయి. ఆ వ్యూహం అమలుకు కార్యక్షేత్రంగా పాకిస్థాన్ మారిపోయింది. అక్కడి సైనిక నియంతృత్వాన్ని ఆ వ్యూహమే బలోపేతం చేసింది. పాకిస్థాన్ సమాజాన్ని సైనిక ఉక్కుచట్రంలో బంధించింది. మతం ఆధారంగా తీవ్రవాదాన్ని సృష్టించటం సాపేక్షికంగా తేలిక. కానీ అది బలపడిన తర్వాత దాన్ని నియంత్రించటం చాలా కష్టం. అగ్రరాజ్యాలు అత్యాధునిక ఆయుధాలను తయారు చేయొచ్చు. మానవరహిత ఆయుధాలతో మారణహోమాలను సృష్టించొచ్చు. కానీ హృదయాల్లో పాతుకుపోయిన భావాలను పెకలించటం కష్టమైన పని. మతతత్వ భూతాలకు ప్రాణంపోసిన తర్వాత అవి స్వతంత్రజీవుల్లా వ్యవహరిస్తాయి. సొంత లక్ష్యాలను ఏర్పరచుకుంటాయి. అలా వ్యవహరించబట్టే ఆల్‌ఖయదా చేతుల్లో అమెరికా కనీవినీ ఎరగని దారుణాన్ని, భయోత్పాతాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కూ ఈ గతి తప్పటంలేదు. అమెరికా కోసం ఆఫ్ఘానిస్థాన్‌లో, కశ్మీర్ కోసం భారత్‌లో తీవ్రవాదులను తయారుచేసి పులిమీద స్వారీ చేస్తోంది. చివరికి ఆఫ్ఘానిస్థాన్ నుంచే తీవ్ర అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటోంది. బలూచీస్థాన్‌పై పట్టును కోల్పోతోంది. తాను సృషించిన తాలిబన్లలోని ఒక శాఖే పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రముఖ అమెరికా చరిత్రకారుడు స్టాన్లీ వోల్‌పర్ట్ 2010లో పేర్కొన్న ప్రకారం ముస్లిం టెర్రరిస్టులు అధికంగా ఉన్న దేశం పాకిస్థానే. డబ్బులు, ఆయుధాలు ఇచ్చినంత మాత్రాన తీవ్రవాద సిద్ధాంతానికి ప్రాచుర్యం లభించదు. దాన్ని మించి చేయగలగాలి. అమెరికా అదీ చేసింది. ఇస్లాం గొప్ప మతమనీ, అది తీవ్ర ప్రమాదంలో పడిందనీ, దేవుడిని నిరాకరించే కమ్యూనిస్టుల చేతుల్లోకి అఫ్ఘానిస్థాన్ వెళ్లిపోయిందనీ, ప్రతి ముస్లిమూ పవిత్రయుద్ధాన్ని (జిహాద్) చేయాల్సిన పరిస్థితి వచ్చిందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఆఫ్ఘాన్‌లో పవిత్రయుద్ధానికి తరలిరావాల్సిందిగా రకరకాల రూపాల్లో ముస్లింలకు పిలుపునిచ్చింది. అరబ్బు, మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికాల నుంచే గాక యూరపు నుంచి కూడా ముస్లింలు తరలివచ్చారు. అయితే ఆఫ్ఘానిస్థాన్ నుంచి పొట్టచేతబట్టుకుని పాక్‌కు తరలివచ్చిన 40 లక్షల మందితో పోల్చితే వీళ్ల బలగం చాలా తక్కువ. తరలి వచ్చిన వారిలో అనువైన లక్షలాది వ్యక్తులకు ఆయుధాలు, డబ్బుని సమకూర్చి రష్యాసేనలపై మెరుపుదాడులకు శిక్షణ ఇచ్చారు. ఐఎస్ఐ, సీఐఏ నేతృత్వంలో శిక్షణశిబిరాలు ఏర్పాటయ్యాయి. కొత్త మదరస్సాలు, మతప్రచార సంస్థలూ పుట్టుకొచ్చాయి. వీటిల్లోనే ఇస్లామిక్ తీవ్రవాదాన్ని నూరిపోశారు. ఆఫ్ఘాన్ యుద్ధం కోసం పాకిస్థాన్‌కు అమెరికా 1980ల్లో 10 బిలియన్ డాలర్లను ఇచ్చింది. అప్పటికి కొన్ని నెలల ముందు పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరితీసిన మిలటరీ నియంత జియా ఉల్ హక్‌పై వ్యతిరేకత కూడా మొదలైంది. ఆఫ్ఘాన్‌లో పవిత్రయుద్ధం జియా గతిని మార్చివేసింది. 11 ఏళ్ల జియా నియంతృత్వ పాలనలో ఇస్లాం తీవ్రవాదం ఎప్పుడూలేని రీతిలో బలపడింది. అమెరికా తన మీద ఆధారపడటాన్ని అలుసుగా తీసుకుని పంజాబ్‌లో ఖలిస్థానీ తీవ్రవాదాన్ని కూడా జియా ఎగదోశాడు. అమెరికా సమకూర్చిన అత్యాధునిక ఆయుధాలతో అన్నివైపులా దాడులకు గురైన రష్యాసైన్యం 1989 చివరినాటికి ఆఫ్ఘాన్ నుంచి వైదొలగింది. రష్యన్ల బెడద తొలగిన తర్వాత తీవ్రవాదులు కశ్మీర్‌లోకి అడుగు పెట్టటం ప్రారంభించారు. అప్పటికే కశ్మీరీ ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుని ఉంది. ఎన్నికలు సక్రమంగా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి పోయింది. ఆర్టికల్ 370 కల్పించిన ప్రత్యేకతలన్నీ అప్పటికే చాలా భాగం తొలగిపోయాయి. భూముల కొనుగోలు, ఉద్యోగాల్లో స్థానికత మినహా మిగతా ప్రత్యేకతలంటూ ఏమీలేవు. ఆర్థికాభివృద్ధి అంతంతమాత్రంగానే జరిగింది. 1947, 1965, 1971లో భారత్-పాక్ మధ్య జరిగిన యుద్ధాలు, అంతర్గత అసంతృప్తుల వల్లా 1975 నాటికే సైన్యం ఇతర బలగాలు కలిపి 5 లక్షలకు పైగా భద్రతాదళాలు కశ్మీర్‌లో తిష్ఠవేశాయని వోల్‌పర్ట్ పేర్కొన్నారు. అధికార లెక్కల ప్రకారమే 1990-95 వరకూ 13000 మంది భద్రతాదళాల చేతుల్లో హతమయ్యారనీ, అనధికార లెక్కల ప్రకారం ఆ సంఖ్య 50,000 దాకా ఉండొచ్చని కూడా వోల్‌పర్ట్ పేర్కొన్నారు.

# లిక్కర్ స్కాంపై ఎవ్వరూ మాట్లాడొద్దు : బాబు ఆదేశం




**అమరావతి, మే 20 (పెన్ సత్తా):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించడంతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కాం అంశంపై కేబినెట్‌లో ప్రస్తావనకు వచ్చింది. మద్యం కుంభకోణం దర్యాప్తు పై ఎవరు మాట్లాడవద్దని, అనవసరంగా ఏదిపడితే అది మాట్లాడితే మరో రకంగా వెళ్తుందని మంత్రులకు సీఎం తెలిపారు. దాని పై సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని, వాళ్ళ పని వాళ్ళని చూసుకోనివ్వాలన్నారు. మద్యం కుంభకోణం పై దర్యాప్తు సంస్థలకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని సూచించారు. మద్యం కుంభకోణంపై పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి ఎవరు మాట్లాడవద్దని సీఎం స్పష్టం చేశారు. ఏపీ కేబినెట్ సమావేశంలో మద్యం కుంభకోణంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ కేసు గురించి మంత్రులు ఎవరూ మాట్లాడవద్దని సీఎం స్పష్టం చేశారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి అవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, ప్రజలు మనోభావాలపై చర్చిద్దామని సీఎం అన్నారు. పంటలకు ఈసారి ధరలు తగ్గాయని, మానిటర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైజాగ్ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడటంపై మంత్రి స్వామిని సీఎం ప్రశ్నించారు. అలా జరగకుండా చూడాలని సీఎం కోరారు. రేషన్ సరఫరాకు ఎండీయూ వాహనాలను కేబినెట్ రద్దు చేసింది. వీటిపై తీసుకున్న రుణాలను ప్రభుత్వం చెల్లించి వాహనాల యజమానులకు ఇచ్చేయాలని నిర్ణయించింది. బియ్యం ఇచ్చే రోజు మినహా మిగతా రోజుల్లో వాళ్ళే వాడుకుంటున్నారని, ఇకపై రేషన్ బియ్యం రేషన్ దుకాణాల్లోనే ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంటికి వెళ్ళి బియ్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ఈ వాహనాల ద్వారా బియ్యం స్మగ్లింగ్ జరుగుతుందని పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ స్థానంలో నగదు ఇస్తే ఎలా ఉంటుంది అనే అంశంపై కూడా కేబినెట్‌లో చర్చకు వచ్చింది. పొగాకు రైతుల సమస్య పై బ్లాక్ బర్లీ పొగాకుపై క్యాబినెట్‌లో చర్చ జరిగింది. ధరల నిర్ణయక కమిటీలో కొత్తగా మంత్రులు గొట్టిపాటి రవి, నిమ్మల రామానాయుడును సీఎం చేర్చారు. ప్రధానితో లోకేష్ భేటీ బాగా జరిగిందని ఈ సందర్భంగా బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శ్రీశైలంకు రద్దీ బాగా పెరిగిందని, ఆదాయంలో రెండవ స్థానంలో ఉందన్నారు. శ్రీశైలం ప్రాంతాన్ని బాగా అభివృద్ధి చేయాలని సీఎం తెలిపారు. అటవీ శాఖ అధికారులతో కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. టెంపుల్ టూరిజాన్ని కూడా డెవలప్ చేయాలని కేబినెట్ సమావేశంలో సీఎం వెల్లడించారు. రెవెన్యూ సమస్యలపై కూడా కేబినెట్‌లో ప్రస్తావించారు సీఎం. రెవెన్యూ సమస్యలు చాలా పరిష్కారం కావడం లేదన్నారు. ఎన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయి అనేది మూడు నెలలకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తల్లికి వందనం జూన్ నెలలో ఇవ్వాలని నిర్ణయించారు. స్కూల్ పున:ప్రారంభం అయ్యే రోజుకు ఇచ్చేయాలని స్పష్టం చేశారు. అలాగే గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించి మంత్రులను సీఎం ఆసిక్తర ప్రశ్న వేశారు. గ్యాస్ సిలిండర్ ఫ్రీగా ఇస్తున్నాం కదా వాళ్లింటికి వెళ్ళి మహిళను అడిగి కాఫీ పెట్టి ఇవ్వమని ఎంత మంది మంత్రులు అడిగారని సీఎం ప్రశ్నించగా మంత్రులు ఎవరు వెళ్లలేదని చెప్పారు. దీంతో జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు తానే వెళ్తున్నానని, మంత్రులు కూడా తప్పనిసరిగా వెళ్లాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాకు ఒక యూనివర్సిటీ ఉండాలని చెప్పారు. ఏలూరులో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజమండ్రిలో తెలుగు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్నదాత సుఖీభవను కేంద్ర ప్రభుత్వంతో కలిపి వేద్దామన్నారు. కేంద్రం ఎప్పుడు వేస్తే అప్పుడు వేయాలని ఆదేశించారు. ఆర్థిక శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగిన ఆదేశాలు ఇచ్చారు.

# అన్యమతస్తులను బదిలీ పాలక మండలి కీలక నిర్ణయాలు



**తిరుమల, మే 20 (పెన్ సత్తా):** టీటీడీ పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసారు. స్విమ్స్ ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయటంతో పాటుగా టీటీడీ ఉద్యోగుల పదోన్నతుల పైనా చర్చ చేసారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్థుల బదిలీలు వీఆర్ఎస్ దిశగా కసరత్తు చేయాలని డిసైడ్ అయ్యారు. ఒంటి మిట్ట ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించనున్నారు. ఇక, తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ వినియోగించాలని డిసైడ్ అయ్యారు. టీటీడీ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఈవో శ్యామల రావు వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్ని అటవీ శాఖ ద్వారా 68.14 శాతం నుండి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయించారు. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74 కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13 కోట్లు, 2027 -28 సంవత్సరానికి రూ.1.13 కోట్లు ప్రభుత్వ అటవీ శాఖకు విడుదల చేసేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వర స్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వర స్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణ స్వామి ఆలయం, ఒంటి మిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్‌ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించారు. తిరుమలలోని విశ్రాంత భవనాల పేర్ల మార్పులో మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈవో వెల్లడించారు. తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశం పై ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60 కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం తెలిపారు. సిబ్బంది నియామకం స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు నిర్ణయం. అదే విధంగా 85 శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (ఆంకాలజీ, పద్మావతి చిన్నిపిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం. శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకు రావాలని నిర్ణయం తీసుకున్నారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్తులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయించారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఆధికారులకు ఆదేశాలు జారీ చేసారు.

ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అమరావతి ఆలయం అభివృద్ధి కోసం చేయాలని నిర్ణయం. ఇందుకు రూ.10 కోట్లు కేటాయింపుకు ఆమోదించారు. శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్ట్స్ లెవల్ చిత్ర బృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# కోవ్వూరులో ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి

**కోవూరు, మే 20 (పెన్ సత్తా):** స్వాతంత్ర సమరయోధుడు, దక్షణ భారత దేశ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతిని, పునస్కరించుకొని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు స్థానిక సిపిఎం పార్టీ సీతపోలయ్య భవనము నందు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి జక్కా శేషమ్మ మారుబోయిన సుబ్బారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు కామ్రేడ్ జక్కా శేషమ్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య పాత్రను గురించి కొనియాడారు.

అలాగే నేటి ప్రధాని మోడీ భారత దేశ గౌరవ ప్రతిష్టలను ట్రంప్ కాళ్ళ ముందు పెట్టారని అక్రమ వలసదారుల పేరుతో భారతీయ బిడ్డల కాళ్ళు, చేతులను గొలుసులతో బంధించి విమానాలెక్కించి అమానుష పద్ధతిలో మన దేశానికి తిరిగి పంపిస్తూ ఉంటే 56 అంగుళాల ఛాతి తనదని గొప్పలు చెప్పుకునే ప్రధానమంత్రి కనీసం నిరసన కూడా వ్యక్తం చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, జక్కా శేషమ్మ, ఫాతిమా, పచ్చిపాల శ్రీనివాసుల రెడ్డి, ఎస్కే బాబు, ఒవ్వేటి మల్లికార్జున రెడ్డి, మారుబోయిన సుబ్బారావు, బట్ట పెద్దబ్బయ్య, ఎస్.కె కాలేశా, ఎస్కే షాన్ భాష, ఎస్.కె అప్రోచ్, కరకంబాకం గోవర్ధన్, గండవరపు విజయ్ కుమార్, ఎస్కే మాభాష, వెలుగు భాస్కర్, ఎస్ కే బాబు, నూకలపాటి మోహన్ రావు, మనీ, ఎస్కే బాబు, తదితరులు ఉన్నారు.

# జూన్ 1 నుంచి చౌకధర దుకాణాల్లోనే రేషన్ మంత్రి : మనోహర్



**అమరావతి, మే 20 (పెన్ సత్తా):** జూన్ ఒకటో తేదీ నుంచి చౌకధర దకాణాల ద్వారానే రేషన్ సరఫరా చేస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారధితో కలిసి నాదెండ్ల మనోహర్ మీడియాకు వెల్లడించారు. చౌక దుకాణాలు ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా మాత్రమే రేషన్ సరఫరా అవుతుందని తెలిపారు. 66 ఏళ్లు పైబడిన వృద్ధులకు డోర్ డెలివరీ చేస్తామన్నారు.

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
తెలుగు దినపత్రిక
Anakapalli
21 - 05 - 2025

# భారత్‌కు వ్యతిరేకంగా కూటమి కట్టిన మూడు దేశాలు


## - భారత్ ప్రస్తుతం త్రీ బ్రదర్స్ అలయన్స్ కొత్త ముప్పును ఎదుర్కొంటోంది




**న్యూఢిల్లీ:** భారతదేశం ప్రస్తుతం త్రీ బ్రదర్స్ అలయన్స్ అనే కొత్త, ప్రమాదకరమైన ముప్పును ఎదుర్కొంటోంది. పాకిస్తాన్‌తో దీర్ఘకాలంగా ఉన్న ఉద్రిక్తతలకు తోడు, ఈ కూటమి భారత దేశానికి కొత్త భౌగోళిక రాజకీయ సవాళ్లను విసురుతోంది. ఈ కూటమిలో పాకిస్తాన్, టర్కీ, అజర్ బైజాన్ దేశాలున్నాయి. ఈ మూడు దేశాలు గత నాలుగేళ్లుగా రాజకీయ, ఆర్థిక, సైనిక సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయి. 2021 లో అజర్ బైజాన్ రాజధాని బాకులో జరిగిన ఒక ముఖ్యమైన సమావేశంలో పాకిస్తాన్, టర్కీ, అజర్ బైజాన్ అధినేతలు తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశం లోనే త్రీ బ్రదర్స్ అలయన్స్ పేరుతో ఒక అనధికారిక కూటమి ఏర్పడింది. ఈ మూడు దేశాల మధ్య చారిత్రాత్మక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. టర్కీ, అజర్ బైజాన్ దేశాలు టర్కిక్ (తురుష్కులు) వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఈ కూటమిని కలిపే కీలకమైన అంశం మతం. ఈ మూడూ మెజారిటీ ఇస్లామిక్ దేశాలు కావడం గమనార్హం. టర్కీ అధ్యక్షుడు రెసెప్ ఎర్డో గాన్ ఈ కూటమి వెనుక ప్రధాన శక్తిగా ఉన్నారు. టర్కీ ప్రభావాన్ని విస్తరించడానికి, ఎర్డో గాన్ తన దేశంతో సన్నిహిత సంబంధాలు కలిగిన దేశాలతో సహకారాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కూటమి మూడు దేశాలకు పరస్పర ప్రయోజనాలను అందించింది. ఉదాహరణకు 2020 నా గోర్నో-కరబాఖ్ సంఘర్షణలో అజర్ బైజాన్ దేశానికి టర్కీ సైనిక మద్దతు అందించింది. ఫలితంగా ఆర్మేనియా పై అజర్ బైజాన్ విజయం సాధించడంలో సహాయపడింది. అదేవిధంగా 1950 ల నుండి పాకిస్తాన్ టర్కీతో సన్నిహిత రక్షణ సంబంధాలను కలిగి ఉంది. దీని ద్వారా క్రూయిజ్ మిస్సైల్స్, డ్రోన్లు, ఇతర ముఖ్యమైన సైనిక సాంకేతికతను పొందింది. సైనిక సహకారం, కాశ్మీర్ సమస్యపై మద్దతు 2021 లో ఈ మూడు దేశాలు త్రీ బ్రదర్స్ సైనిక విన్యాసాన్ని ప్రారంభించాయి. సైనిక సమన్వయాన్ని మెరుగు పరచుకున్నాయి. ఈ కూటమి దేశాలు ఒకరి ప్రాదేశిక వివాదాలలో మరొకరికి మద్దతు ఇస్తాయి. అంటే కాశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ విధానానికి టర్కీ, అజర్ బైజాన్ మద్దతు ఇస్తాయని దానర్థం. టర్కీ ఐక్య రాజ్య సమితి (యుయెన్) వంటి వేదికల పై కాశ్మీర్ సమస్యను పదే పదే లేవనెత్తింది. ఇది భారతదేశాన్ని తీవ్రంగా కలవరపరిచింది. పహల్‌గాం ఉగ్రదాడి తర్వాత భారత్ - పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో అజర్ బైజాన్, టర్కీ రాజకీయంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చాయి. భారతదేశం పై దాడుల్లో టర్కీ అందజేసిన డ్రోన్లను పాకిస్తాన్ ఉపయోగించింది. ఇది ఈ కూటమి యొక్క సైనిక సహకార తీవ్రతను సూచిస్తుంది. ఈ కూటమి ఎందుకు ఆందోళన కలిగిస్తుంది?, ఒబ్సర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ కు చెందిన కబీర్ తనేజా మాట్లాడుతూ ఈ కూటమి చాలా కాలంగా ఉంది. ఇది భారత దేశానికి భౌగోళిక రాజకీయ సమస్యగా మారింది. కానీ అంతర్జాతీయ స్థాయిలో ఇది భారతదేశానికి పెద్ద సమస్య అని నేను అనుకోను అని అన్నారు. అయితే టర్కీ, అజర్ బైజాన్ రెండూ పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థలో పెట్టు బడులు పెట్టడం లేదని ఆయన సూచించారు. అయినప్పటికీ భారతదేశం ఈ కూటమికి రాజకీయంగా ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందని తనేజా వాదించారు. ఇరాన్, ఆర్మేనియాతో సంబంధాలు ఈ కూటమి విసిరే సవాలును ఎదుర్కోవడానికి భారతదేశం ఇరాన్, ఆర్మేనియాతో సన్నిహితంగా వ్యవహరిస్తోంది. ఆర్మేనియా, అజర్ బైజాన్ తో దశాబ్దాలుగా సరిహద్దు వివాదాలు కలిగి ఉంది. ఇరాన్ కూడా అజర్ బైజాన్‌తో ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. ఇరాన్‌లో నివసిస్తున్న లక్షలాది అజారీలు అజర్ బైజాన్‌తో సాంస్కృతిక సంబంధాలను కలిగి ఉన్నారు. ఆ దేశం ఈ సంబంధాలను ఉపయోగించి విభజన ఉద్యమాలను ప్రోత్సహించవచ్చని ఇరాన్ భయపడుతోంది. భారతదేశం ఆర్మేనియాకు వెపన్ లొకేటింగ్ రాడార్లు, ఆర్టిలరీ సిస్టమ్స్, రాకెట్ లాంచర్లను విక్రయించింది. దీని ద్వారా ఆర్మేనియా సైనిక సామర్థ్యాన్ని బలోపేతం చేసింది. గత సంవత్సరం ఆస్ట్రా మిస్సైల్స్ కొనుగోలు, ఆర్మేనియా ఎస్ యు 30 ఫైటర్ జెట్‌లను అప్ గ్రేడ్ చేయడానికి చర్చలు జరిగాయి. ఈ చర్యలు అజర్ బైజాన్‌ను కలవరపరిచాయి. అదే విధంగా భారతదేశం టర్కీతో ప్రాదేశిక వివాదంలో ఉన్న సైప్రస్‌తో సంబంధాలను బలోపేతం చేసింది. భారతదేశం సైప్రస్ కు రాజకీయ మద్దతు ఇచ్చింది. సైప్రస్ భారతదేశ రాజకీయ ప్రాధాన్యతలకు మద్దతు ఇచ్చింది. ఈ విధానం టర్కీని అసహనానికి గురిచేసింది. ఇటీవలి ఉద్రిక్తతలు భారత్ చర్యలు టర్కీ, అజర్ బైజాన్ రెండూ పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు ఇవ్వడంతో భారతదేశం ఈ రెండు దేశాలతో సంబంధాలు మరింత దిగజారే అవకాశం ఉంది.

ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో, జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఒక టర్కీ విశ్వవిద్యాలయంతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. అలాగే భారతీయ పర్యాటకులు టర్కీ, అజర్ బైజాన్‌లను బహిష్కరించాలని సామాజిక మాధ్యమాల్లో పిలుపునివ్వడమే కాదు, ఆ దేశాలకు వెళ్లేందుకు చేసుకున్న టూర్ ప్యాకేజీలను రద్దు చేసుకున్నారు. త్రీ బ్రదర్స్ అలయన్స్ సవాలును ఎదుర్కోవడానికి భారతదేశం గ్రీస్, సైప్రస్, ఆర్మేనియా, ఇరాన్ వంటి దేశాలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ సహకారాన్ని కొనసాగించే అవకాశం ఉంది. టర్కీ, అజర్ బైజాన్ తో భారతదేశ సంబంధాలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్నాయి కానీ పూర్తిగా శత్రుత్వంగా మారలేదు. కాలం గడిచేకొద్దీ మరింత దిగజారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కూటమి భారతదేశానికి సవాలుగా ఉన్నప్పటికీ, దాని ప్రభావాన్ని తగ్గించడానికి భారతదేశం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

# 22న ఢిల్లీకి సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 20 (పెన్ సత్తా):** కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తవుతోంది. అటు టీడీపీ మహానాడు వేడుకకు సిద్ధం అవుతోంది. ఈ సమయంలోనే సీఎం చంద్రబాబు మూడు రోజుల ఢిల్లీ పర్యటన ఖరారైంది. ఈసారి పర్యటన అధికారికంగా రాజకీయంగా కీలకంగా మారుతోంది. ఈ నెలాఖరులో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకొనే ఛాన్స్ ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు 22వ తేదీ ఢిల్లీకి వెళ్లనున్నారు. 23వ తేదీ కేంద్ర మంత్రులతో సిఎం సమావేశాలు ఖరారయ్యాయి. ఆర్థిక, ఇరిగేషన్, హెూం, జాతీయ రహదారుల శాఖల మంత్రులతో చంద్రబాబు సమావేశం కానున్నారు. ఆ మరుసటి రోజు 24వ తేదీ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో పాల్గొననున్న చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తావన చేయనున్నారు. ఇప్పటికే నీతి అయోగ్ సభ్యులకు ఏపీలో తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. అదే విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ గవర్నెర్స్ గురించి ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ పర్యటనలో రాజకీయ అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. పార్టీ మహానాడు సమయంలో కడపతో పాటుగా, ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ ముఖ్యులు టీడీపీలో చేరేందుకు సిద్దంగా ఉన్నారని పార్టీ నేతల సమాచారం. కాగా, ఒక రాజ్యసభ సభ్యుడు సైతం కూటమి పార్టీలతో టచ్‌లోకి వెళ్లినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఆ సభ్యుడు తనకు తిరిగి టీడీపీ నుంచి పెద్దల సభకు అవకాశం ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్దంగా ఉన్నానంటూ సంకేతాలు ఇస్తున్నారు. ఈ పర్యటనలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులతో పాటుగా లిక్కర్ కేసు విచారణ, జగన్ ప్రమేయం పైన ఇప్పటి వరకు లభించిన ఆధారాల గురించి వివరించే ఛాన్స్ కనిపిస్తోంది. ఇక, మహానాడు తరువాత ఏపీలో కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయని ప్రచారం సాగుతున్న వేళ చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఆసక్తికరంగా మారుతోంది.

# ప్రపంచానికి మెడికల్ హబ్‌గా ఇండియా

## - వైద్య ఖర్చులు మన దగ్గరే తక్కువట




**ఇంటర్నెట్ డెస్క్ :** ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో వైద్య ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇది నిజంగా భారతీయులకు, అలాగే విదేశాల నుంచి వైద్యం కోసం వచ్చే వారికి శుభవార్తే అని చెప్పొచ్చు. ముఖ్యంగా క్లిష్టమైన శస్త్రచికిత్సల విషయంలో కూడా మన దేశం చాలా సరసమైన ధరలకే ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందిస్తోందని నివేదికలు చెబుతున్నాయి. ఒక హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ (గుండె మార్పిడి) తీసుకుంటే ఇండియాలో దీనికి సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చవుతుంది. అమెరికాలో మాత్రం ఏకంగా రూ.1.4 కోట్ల వరకు ఖర్చవుతుందని తేలింది. అంటే, మన దేశంలో గుండె మార్పిడి ఖర్చు అమెరికాతో పోలిస్తే దాదాపు 30 రెట్లు తక్కువ. సింగపూర్, సౌత్ కొరియా వంటి దేశాల్లో కూడా వైద్య ఖర్చులు భారీగానే ఉంటాయి. గుండె బైపాస్ సర్జరీ, హిప్ రీప్లేస్‌మెంట్, యాంజియోప్లాస్టీ, డెంటల్ ఇంప్లాంట్, కిడ్నీ మార్పిడి వంటి అనేక ప్రధాన చికిత్సల విషయం లోనూ ఇదే పరిస్థితి. ఉదాహరణకు, బైపాస్ సర్జరీకి మన దగ్గర రూ. 2.5 లక్షల నుంచి రూ. 4.5 లక్షల వరకు ఖర్చవుతుండగా ఇతర దేశాల్లో దీనికి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఎందుకు ఇండియాలో ఆపరేషనల్ ఖర్చులు తక్కువ. మన దేశంలో ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలు, పరికరాల కొనుగోలు ఖర్చులు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. ఇండియాలో అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారు. దీనివల్ల కార్మికుల కొరత ఉండదు. వేతనాలు కూడా ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు తక్కువ ఖర్చుతో సేవలు అందిస్తూ, ప్రైవేట్ ఆస్పత్రుల పై ధరల విషయంలో ఒక పోటీని సృష్టిస్తాయి. మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతోంది. మెడికల్ టూరిజంలో దూసుకెళ్తున్న ఇండియా భారత దేశంలో తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది రోగులు చికిత్స కోసం మన దేశాన్ని ఆశ్రయిస్తున్నారు. దీన్నే మెడికల్ టూరిజం అంటారు. హైదరాబాద్ వంటి నగరాలు ఇప్పటికే మెడికల్ టూరిజానికి గ్లోబల్ హబ్‌లుగా మారుతున్నాయి. యూరప్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60 నుంచి 80 శాతం తక్కువగా ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే విదేశాల నుంచి పెద్ద ఎత్తున రోగులు ఇక్కడికి వస్తున్నారు. క్లిష్టమైన సర్జరీలు, క్యాన్సర్ చికిత్సలు, గుండె సంబంధిత వ్యాధులు, అవయవ మార్పిడి వంటి వాటికి మన దేశం ఒక నమ్మకమైన చికిత్సా కేంద్రంగా మారుతోంది. ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్య నిపుణులు తక్కువ ధరకే అందుబాటులో ఉండటం వల్ల ఇండియా వరల్డ్స్ ఫార్మసీగానే కాకుండా, వరల్డ్స్ హెల్త్‌కేర్ డెస్టినేషన్ గా కూడా రూపాంతరం చెందుతోంది. ఈ నివేదికలు భారత్ వైద్య రంగంలో మరింత బలపడటానికి దోహదపడతాయని చెప్పొచ్చు.

# మెగాస్టార్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు




**అనకాపల్లి, మే 20 (పెన్ సత్తా):** పట్టణ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 22 చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అనకాపల్లి పట్టణ మెగాస్టార్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి 22 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అఖిలభారత చిరంజీవి ఫ్రాక్స్ ఉపాధ్యక్షులు గల్లా కొండలరావు తెలియజేశారు. మంగళవారం ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి చిరంజీవి జన్మదిన వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా ఒక్కొక్క రోజు ఒక్కొక్క సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చిరంజీవి ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు శ్రీరామదాసు గోవిందరావు, మళ్ల శ్రీను, కొణతాల శ్రీను, కొమ్మోజి రాజు, బొడ్డేడ శ్రీను, నగిరెడ్డి మధు, ఆకులేట్ సతీష్, కాండ్రేగుల ప్రసాద్, గణేష్ వర్మ, కోయిలాడు గంగాధర్, కోడి పవన్, రామకోటి, కులుకూరి కుమార్, పాల్గొన్నారు.

# విచారణ జరిపి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తా



**విడవలూరు, మే 20 (పెన్ సత్తా):** ప్రజలు నుండి వచ్చిన వినతులను పరిష్కారం చెయ్యడానికి సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా విజ్ఞప్తిల కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్ కుమారి పాల్గొని వచ్చిన అర్జీలను స్వీకరించారు వీటిపై విచారణ జరిపి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. అదేవిదంగా తహసీల్దార్ చంద్రశేఖర్ కూడా ప్రజల నుండి వినతులను తీసుకొని సత్వర చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# విశాఖ డిప్యూటీ మేయర్‌గా దల్లి




**విశాఖపట్నం, మే 20 (పెన్ సత్తా):** విశాఖ డిప్యూటీ మేయర్‌గా జనసేన పార్టీకి చెందిన 64 వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విశాఖ జీవీఎం సీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 60 మంది సభ్యులు హాజరయ్యారు. జనసేన పార్టీకి చెందిన 64 వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద రాజును డిప్యూటీ మేయర్‌గా మొదట ప్రతిపాదించారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు పివిజిఆర్ నాయుడు (గణబాబు), బీజేపీ శాసన సభ్యుడు విష్ణు కుమార్ రాజులు కలిసి గోవింద రాజు అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. దల్లి గోవింద రాజు ఒక్కరే పోటీలో నిలవటంతో అతడు డిప్యూటీ మేయర్ గా ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టు ప్రిసైడింగ్ అధికారి కే.మయూరి అశోక్ ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. అనంతరం దల్లి గోవిందరాజు ప్రమాణ స్వీకారం చేశారు.

# ఘనంగా ప్రారంభమైన మినీ మహానాడు







**తిరుపతి, మే 20 (పెన్ సత్తా):** రూరల్ మండలం తనపల్లి వద్ద గల రఘునాథ్ రిసార్ట్స్‌లోని చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా ప్రారంభ మైన మినీ మహానాడు. ఎమ్మెల్యే పులివర్తి నాని అధ్యక్షతన ప్రారంభం అయిన మినీ మహానాడు. మినీ మహానాడుకు విచ్చేసిన నియోజకవర్గం లోని నాయకులను, కార్యకర్తలను, ప్రజలను పేరు పేరునా ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే. పార్టీ కార్యాలయ ఆవరణలో టిడిపి పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముందుగా నియోజకవర్గంలో మృతి చెందిన టిడిపి పార్టీ కుటుంబ సభ్యులకు నివాళులర్పించి, అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని. ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొన్న నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.

# కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో జరిగే మినీ మహానాడును జయప్రదం చెయ్యండి

**- బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావు**

**విడవలూరు, మే 20 (పెన్ సత్తా):** కోవూరులోని పీవీఆర్ హాల్లో మంగళ వారం 20న సాయంత్రం జరిగే టీడీపీ మినీ మహానాడును జయ ప్రదం చెయ్యాలని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వన మాల జనార్ధన్‌రావు అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో జరిగే మహానాడుకు టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు ప్రధాన నేతలు పాల్గొని పార్టీ బలోపేతం కొరకు కృషి చెయ్యాలి ని ఆయన విజ్ఞప్తి చేసారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాలన సుస్థిర పాలనగా ఉందని అన్నారు. కోవూరులో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పాలన పారదర్శకతంగా ఉందని బాషా కొనియాడారు.



# అవినీతి అధికారుల మీద చర్యలు తీసుకోవాల్సిందే దాడి

**- సొంత ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టిన దాడి**



**అనకాపల్లి, మే 20 (పెన్ సత్తా):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు మరోసారి అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేశారు. అనకాపల్లి జిల్లాలో అధికారులు అక్రమాలు అవినీతి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడం ఇపుడు టీడీపీతో పాటు కూటమి లోనూ చర్చనీయాంశం అయింది. దాడి ఎవరిని విమర్శిస్తున్నారు అన్నది అర్థం కాక అంతా ఆలోచనలో పడిపాయారు. అనకాపల్లి జిల్లాలో కూటమి ప్రజా ప్రతినిధులే ఉన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యేగా దాడికి ఒకనాటి రాజకీయ ప్రత్యర్ధి కొణతాల రామకృష్ణ జనసేన నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక అనకాపల్లి రాజకీయం దాడికి అందకుండా పోతోంది అన్న ఆవేదన ఉంది అని అంటున్నారు.

అనకాపల్లి ఎంపీగా బీజేపీ నుంచి బిగ్ షాట్ సీఎం రమేష్ ఉన్నారు. అనకాపల్లి టీడీపీలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఇతర కీలక నేతల హవా సాగుతోంది. దాంతో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన దాడికి సరైన ప్రాధాన్యతగా లభించడం లేదు అని అంటున్నారు. నామినేటెడ్ పదవులు కూడా ఆయన కుటుంబం దాకా రాలేదు. పార్టీలు మారి వచ్చారు అని పక్కన పెడుతున్నారు. అదే విధంగా వచ్చే ఎమ్మెల్సీగా అయినా చోటు కల్పించలేదు అన్న ఆవేదన ఆయనకు ఉంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో మినీ మహానాడు వేదికగా దాడి అధికారుల మీద తన ఆగ్రహం చూపించారు అని అంటున్నారు. అధికారులు అవినీతి అని ఆయన చేసిన విమర్శలు అటు తిరిగి ఇటు తిరిగి ప్రభుత్వం మీదకే వస్తాయని పెద్దాయన గ్రహించలేక పోయారా అన్న చర్చ సాగుతోంది. అంతే కాదు అవినీతి అధికా రుల భరతం పట్టాలని ఆయన కోరుతున్నారు.

చంద్రబాబుకు చెడ్డ పేరు తెస్తున్నారు అని మండిపడుతున్నారు. అవినీతి అధికారుల మీద చర్యలు తీసుకోవాల్సిందే అని అంటున్నారు. మొత్తానికి దాడి చేసిన ఈ రీ సౌండ్ టీడీపీలో చర్చగా ఉంది. పెద్దాయన చేసిన దాడి ఎవరి మీద అని అంతా హాట్ డిస్కషన్ చేస్తున్నారు.

# సుందరపు అభివృద్ధి చూసి జనసేనలో చేరికలు



**అచ్చుతాపురం, మే 20 (పెన్ సత్తా):** మండలంలో ఎస్.టి.బి.ఎల్ లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జనసేన పార్టీ కార్యాలయంలో ఉప సర్పంచ్ సత్తిబాబు, బి.శివ అప్పారావు ఆధ్వర్యంలో ఆవరాజ్యం పంచాయితీ, జె పి అగ్రహారం, పిల్లోడు పాలెం గ్రామానికి చెందిన వైకాపా నాయకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం ఈ కార్యక్రమంలో జె పి అగ్రహారం, పిల్లోడు పాలెం గ్రామానికి చెందిన వైకాపా నాయకులు సత్తిబాబు, పి.శివ, అప్పారావు, అప్పలరాజు, బి.రాజు, ఎం.అప్పలరాజు, ఎన్.సత్తిబాబు, బి.అప్పలరాజు, టి.రాజేష్, పి.నవీన్, పి.అప్పలరాజు, పి.కోటేశ్వర రావు, ఎన్.సురేష్, పి.రాము, బి.అప్పారావులు తమ అనుచరులతో జనసేనలో చేరారు. వీరికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు.

# గంధం కాంతారావు కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**- జర్నలిస్ట్ సతీమణి కౌసల్యమ్మకు నివాళులు అర్పించిన చేవూరు దేవకుమార్ రెడ్డి**

**విడవలూరు, మే 20 (పెన్ సత్తా):** కోవూరు నియోజకవర్గంలోని విడవ లూరు మండలం గాదిలదిన్నె గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గంధం కాంతారావు కుటుంబం ను నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవ కుమార్ రెడ్డి సోమవారం దిన్నెలో పరామర్శించారు. 15 ఏళ్ల క్రితం జర్నలిస్ట్ కాంతారావు మృతి చెందారని, ఆయన సతీమణి కౌసల్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ చేవూరుతో పలువురు నేతలు నివాళులు అర్పించారు. కుటుంబం సభ్యులు విడవలూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు గంధం యుగంధర్‌ను ఆయన పరామర్శించారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవ్ కుమార్ రెడ్డి ఆయనతో ఏటూరు శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, హుస్సేన్ భాష, నెల్లూరు వెంకటే శ్వర్లు, షేక్ దిన్, సుబ్రహ్మణ్యం చంబయ్యులు ఉన్నారు.

# విద్యుత్, ప్రకృతి వ్యవసాయ అధికారులతో కొణతాల సమావేశం



**అనకాపల్లి, మే 20 (పెన్ సత్తా):** మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మంగళవారం ఈపీడీసీఎల్ ఎస్ఈ జి ప్రసాద్, ఈ ఈ శేఖర్‌తో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భముగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రైతులకు ఎంతో ఉపయోగపడే ఏజీఎల్ సర్వీస్‌లలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, వినియోగదారులు సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దు అని వారిని ఆదేశించారు. అనంతరం కొణతాల రామకృష్ణ ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చున్న బృందం అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. అనకాపల్లి, కశింకోట మండలాల్లో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన పెంచి ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మార్కెటింగ్ అవకాశాలను కల్పించాలని అధికారులకు సూచించారు.

# గ్రంథాలయం వేసవి శిక్షణా శిబిరంలో పిల్లలతో క్రికెట్ ఆడుతున్న సిఐ గణేష్

**అచ్యుతాపురం, మే 20 (పెన్ సత్తా):** శాఖ గ్రంథాలయంలో ఓరియంటేషన్ పోగ్రంలో బాగంగా విజ్ఞాన వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులకు రీ సోర్స్ పర్సన్‌గా విచ్చేసిన పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ పిల్లలుకు క్రికేట్ ఆడుటకు శిక్షణ ఇస్తున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వేసివి శెలవుల్లోనే కాకుండా క్రికెట్ ప్రాక్టీస్ ప్రతి సండే పూట చేయాలి అని, రానున్న భవిష్యత్తులో మంచి క్రికెట్ ప్లేయర్‌గా మంచి గుర్తింపు పొందుతారు అని పిల్లలకు వివరించారు. అంతేకాకుండా మన గ్రంధాలయాల్లో మంచి మంచి గ్రంధాలు, పురాణాలు కూడా ఉంటాయి అవి కూడా చదివితే, ఉద్యోగ అవకాశాలతో పాటు మీకు భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగడానికి ఉపయోగపడతాయి అన్నారు. అనంతరం స్థానిక లైబ్రేరియన్ది కోటేశ్వరరావు కూడా పిల్లల్ని ప్రోత్సహిస్తూ జీ కే బుక్స్, ఫిజిక్స్ పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటున్నాయని, చిన్న పిల్లలకు కథలు బుక్కులు కూడా అందుబాటులో ఉంటున్నాయని ఆయన అన్నారు. అనంతరం వచ్చిన పిల్లలకు స్వీట్లు పంచడం జరిగింది.



# ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, మే 20 (పెన్ సత్తా):** ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అనకాపల్లి రింగు రోడ్డ్ జంక్షన్ వద్ద అంగరంగ వైభవంగా జరిపారు. ఉదయం అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జూనియర్ ఎన్టీఆర్ పేరు మీద గోత్రనామములతో అభిషేకం జరిపించారు. తదుపరి రింగు రోడ్డ్ జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ కేక్ కటింగ్ చేసి, భారీ అన్న సమారాధనను అభిమానులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు, ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు సూరిశెట్టి రమణ కుమార్, బుద్ధ జగదీష్ గాంధీ, అల్లు సురేష్, కరణం సర్వేశ్వరరావు, సరగడం శంకర్ (కటక్), కోయిలాడ ఈశ్వర్, బొడ్డెర గిరీష్, దాడి అప్పారావు, ఉలింగల సంతోష్, సతీష్, సురేష్ మరియు విశాఖపట్నం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, మద్దాల భీమేష్, అనకాపల్లి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# నల్లమడ వాగును పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

**బాపట్ల, మే 20 (పెన్ సత్తా):** బాపట్ల జిల్లాలో నీటి పారుదల శాఖ, డ్రైనేజీ శాఖలు నిర్వహించే మరమ్మత్తుల పనులను బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత బాపట్ల మండలం జిల్లెల్లమూడి గ్రామం లోని నల్లమడ వాగులో కోతకు గురైన కరకట్ట ప్రాంతాన్ని సందర్శించారు. నల్లమడ వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని, వాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం నరసాయపాలెం గ్రామం దగ్గర నల్లమడ వాగు లాకులను పరిశీలించారు. నల్లమడ వాగు లాకుల గురించిన వివరాలను నీటి పారుదల ఎస్ ఈని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు అక్కడ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్ ఈ వెంకట రత్నం, డ్రైనేజీ శాఖ ఈఈ మురళికృష్ణ, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ ఎస్ కె సలీమా, నీటి పారుదల శాఖ మరియు డ్రైనేజీ శాఖలకు చెందిన డి ఈ లు, ఏ ఈ లు పాల్గొన్నారు.





# భీమిలి మినీ మహానాడులో బాలాజీ



**అనకాపల్లి, మే 20 (పెన్ సత్తా):** భీమిలి నియోజకవర్గంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించబడిన మినీ మహానాడు కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, భీమిలి నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్నీ బాలాజీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ మాట్లాడుతూ గత 11 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టినటువంటి పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించడం జరిగింది. అంతే కాకుండా ఈ నెల కడపలో నిర్వహించబోయే మహానాడు కార్యక్రమంలో గురించి కూడా ప్రసంగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ గంటా రవితేజ, నియోజకవర్గ నాయకులు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# 130 కిలోల గంజాయి పట్టివేత ఒకరు అరెస్టు

## - రూ. 6.5 లక్షల విలువైన గంజాయి, కారు స్వాధీనం



**చీడికాడ, మే 20 (పెన్ సత్తా):** విశ్వసనీయ సమాచారం ఆధారంగా చీడికాడ ఎస్ఐ సతీష్, అతని బృందం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఒక నిందితుడిని అరెస్టు చేసారు. స్వాధీనమైన గంజాయికి మార్కెట్ విలువ సుమారు రూ.6,50,000/-గా ఉంటుంది. కేసు వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం నుండి అక్రమంగా గంజాయి తరలింపు జరగబోతున్నదన్న సమాచారంపై కె.కోటపాడు ఇన్స్పెక్టర్ పైడుపు నాయుడు ద్వారా సమాచారం అందగా, చీడికాడ ఎస్ఐ సతీష్ తన బృందంతో కలిసి చర్యలు చేపట్టారు. నిందితుడు కాశీ తేజ (26), బయలుపూడి గ్రామానికి చెందినవాడు, తన కారులో గంజాయిని ఖండివరం గ్రామ శివారులో దాచి, వర్షం వలన పోలీసుల నిఘా తక్కువగా ఉంటుందన్న నమ్మకంతో తరలించేందుకు యత్నించాడు. ఈ సమయంలో పోలీసులు అతని కారును అడ్డగించి డిక్కీలో ఉన్న గంజాయిని మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌గా ఉన్న కాశీ తేజ 26 సం.లను అరెస్టు చేశారు. అయితే అతనితో పాటు పైలట్‌గా ఉన్న ముగ్గురు నిందితులు తప్పించుకొని పారిపోయారు. పోలీసులు వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో ముందుకు వెళ్తున్న పోలీసులు 'ఫార్వర్డ్ లింక్స్', 'బ్యాక్ వర్డ్ లింకులను' గుర్తించి, త్వరలో మిగిలిన నిందితుల్ని కూడా అరెస్టు చేయనున్నారని కె.కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.పైడపు నాయుడు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎస్సై బి.సతీష్, సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

# మినీ మహానాడు పండుగకు తరలి రండి

## - పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్దాం
## - సూపర్ సిక్స్ పథకాలు అమలుతో అన్ని వర్గాలకు చేరువ కాబోతున్నాం
## - చంద్రబాబు నాయకత్వంలో కోటి సభ్యత్వాలతో రికార్డు సృష్టించాం



**ధర్మవరం, మే 20 (పెన్ సత్తా):** నియోజకవర్గలో నిర్వహించే మినీ మహానాడు పండుగకు ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి మినీ మహానాడు పండుగను విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

మంగళవారం ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు ధర్మవరం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే మినీ మహానాడు పండుగను ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో అట్టహాసంగా, విజయవంతంగా జరుపుకుందామని తెదేపా నాయకులు నియో జకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ నెల 23 శుక్రవారం రోజున ఉదయం 10 గంటలకు ధర్మవరం పట్టణం గాంధీనగర్‌లో గల మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమం జరుగు తుందని, ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్‌తో పాటు, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కెపార్థసారధి, నియోజకవర్గ అబ్జర్వర్ నాగేంద్ర కుమార్ హాజరవుతున్నారని, కావున ఈ కార్యక్రమమును విజయవంతం చేయుటకు నియోజకవర్గంలో గల తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులందరూ హాజరుకావాలని తెలుగుదేశంపార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

# డ్రైన్ తలుపులు ఏర్పాటు చేయకపోతే క్రాఫ్ హాలిడే ప్రకటిస్తాం

## - కలెక్టరేట్ ఎదుట పేరూరు గ్రామ రైతుల ఆవేదన



**అమలాపురం, మే 20 (పెన్ సత్తా):** మురుగునీరు దిగే కుమ్మరి కాలువ డ్రైన్ లాకు తలుపులు చెడిపోవడంతో ఉప్పునీరు పోటెత్తి పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని డ్రైన్ తలుపులు మార్చకపోతే పంట విరామం ప్రకటిస్తామని పేరూరు గ్రామ రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మరి కాలువ డ్రైన్ లాకు తలుపులు దెబ్బ తినడంతో గోదావరి పోటు సమయంలో ఉప్పునీరు పంటపొలాలలోనికి వచ్చి చేరుతుందని దీంతో వరి పంట పండటం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం అధ్యక్షులు, పేరూరు గ్రామస్తుడు దేగల వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్లోని స్పందన కార్యక్రమంలో పేరూరు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. గతంలో ఏడాదికి రెండు పంటలు పండే సారవంతమైన పంట పొలాలు ఉప్పునీరు వచ్చి చేరడంతో ఒక్క పంట కూడా సరిగ్గా పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసామని, ప్రజాప్రతినిధుల వద్ద తమ గోడు వెల్లబోసుకున్నప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి కుమ్మరి కాలువ డ్రైన్ లాకుకు దెబ్బతిన్న తలుపులను ఏర్పాటు చేయకపోతే పంట విరామం ప్రకటిస్తామని హెచ్చరించారు.

# రాంబిల్లి మండలంలో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి



**రాంబిల్లి, మే 20 (పెన్ సత్తా):** రాంబిల్లి మండలంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో పుట్టిన, తన జీవితం బడుగు బలహీన వర్గాల కోసం, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కోసం, ఈ దేశంలో సమ సమాజం ఏర్పడాలని, తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. సుందరయ్య నాయకత్వంలో తెలంగాణలో వీరోచిత పోరాటం చేసి, 10 లక్షల ఎకరాలు భూమి పేదలకు పంచిన గొప్ప నాయకుడని, మొట్టమొదటి పార్లమెంటు ప్రతిపక్ష నేతగా, పార్లమెంట్కే సైకిల్ మీద వెళ్లిన సాధారణ నాయకుడని, ఈ రోజుల్లో ఇటువంటి నాయకులు లేకపోవడం బాధాకరమన్నారు. సుందరయ్య వారి కలలు కన్నా సమాజం కోసం, అనేక ఉద్యమాలు నిర్వహించి, కార్మికులు, కర్షకులు, పేదలను ఐక్యం చేసి మనం మరింత ముందుకు సాగాలని, అప్పుడే సుందరయ్యకి నిజమైన నివాళులు అర్పించిన వారిమవుతామని జి.దేముడు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ధోని కాసియా, వై.రాము, కె.నూక రత్నం, జి మ.లక్ష్మి, సిహెచ్ పవన్ కుమార్, సిహెచ్.స్తగంగరాజు, అప్పారావు, చిన్న కలవల పల్లి గ్రామ సర్పంచ్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సామర్లకోట-కాకినాడ రహదారి మూసివేత

**సామర్లకోట, మే 20 (పెన్ సత్తా):** సామర్లకోట – కాకినాడ రహదారి ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూసి వేస్తున్నట్లు సామర్లకోట ట్రాఫిక్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ అడపా గరగారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగరమాల ప్రాజెక్టు పనులలో భాగంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులలో భాగంగా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో సామర్లకోట–కాకినాడ రహదారిపై వంతెన నిర్మిస్తున్న కారణంగా నాలుగు రోజుల పాటు రహదారని మూసివేసి వాహనాలను ప్రత్యమ్నాయ మార్గం ద్వారా ట్రాఫిక్ మళ్ళించనున్నట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణకు గాను వాహనాలను ఎడిబి బైపాస్ రోడ్డు మీదుగా ఉండూరు, పనసపాడు, గైగోలుపాడు, సర్పవరం మీదుగా కాకినాడ వెళ్ళాలని, అదేవిధంగా కాకినాడ నుంచి వచ్చే వాహనాలు కూడా అదే రహదారిలో రావాలని ఆయన వివరించారు. వెంకట కృష్ణ రాయపురం వెళ్ళు వాహనదారులు బైపాస్ రోడ్డులోని ఉండూరు జంక్షన్ నుంచి



వెళ్ళవలసిందిగా ఆయన తెలిపారు. అలాగే ఈనెల 27, 28 తేదీలలో మండలంలోని అచ్చంపేట సెంటర్ నందు వంతెన నిర్మిస్తున్న కారణంగా రెండు రోజుల పాటు ఎడిబి బై పాస్ రోడ్డు మూసివేసి, ఆ వైపుగా వెళ్ళే వాహనాలు కెనాల్ రోడ్డు మీదుగా పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు, ప్రయాణీకులు, వాహనదారులు పోలీస్ అధికారులకు, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ గారగారావు కోరారు.

# పూల వ్యాపారితో ఈవో కుమ్మక్కా...?

## - అర్ధరాత్రి తెరుస్తున్న ఆలయ గేటు

**కాకినాడ, మే 20 (పెన్ సత్తా):** ఆ గుడిలో పనిచేసే పిల్లి గుడ్డిదైతే ఎలుక ఏలుబడి చేసిందన్న చందాన ఒక ప్రాముఖ్యత కలిగిన ఆలయంలో ఈవో కన్నా గుడి సిబ్బందిదే హవా అన్నట్టుగా కొనసాగుతున్నదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ బంధానికి అడ్డుకట్ట పడడం లేదు సరికదా గుడి సిబ్బందే అక్కడున్న వర్తకులకు సహకారం అందించడం పరిపాటిగా మారిందన్న మాటలు వినిపిస్తున్నాయి. విషయానికొస్తే స్థానిక సినిమా రోడ్డు సంతమార్కెట్టు పక్కన ఉన్న కనకదుర్గమ్మ ఆలయం బయట ఓ పూలు, కొబ్బరికాయల వ్యాపారి గుడి ప్రాంగణం బయటవున్న డ్రయినేజీని ఆక్రమించి వ్యాపారం సాగిస్తున్నాడు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులకు తెలియడంతో సదరు వ్యాపారిని అక్కడనుంచి ఖాళీచేయమని చెప్పి వెళ్లిపోయారు. అంతే అక్కడ నుంచి ఓ తోపుడు బండి మీద పండ్లు, కొబ్బరి కాయలు, పూలు ఏర్పాటు చేసుకుని గుడి గట్టుమీదనే తన ఆక్రమణలు మళ్లీ యధావిధిగా మొదలెట్టాడు. దీనికితోడు ఈ ఆలయంలో పని చేసే ఓ కిందిస్థాయి సిబ్బంది వ్యాపారికి సహకరించడంతో ఈ దుకాణదారుడికి సంబం ధించిన సామాగ్రి ఆలయంలోనే స్టోరేజీ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై దేవదాయ శాఖపై అధికారులకు తెలియచేసినా పరిస్థితి యధాతథంగానీ ఉంటుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ ఆలయాన్ని రాత్రి 8.30 గంటలకు మూసేయాలని, కానీ ఆలయంలో రాత్రి 9.30 గంటలు దాటినా లైట్లు వేసి సదరు వ్యాపారం తన వ్యాపార




లావాదేవీలు, సామాన్లు సర్దుకోవడం చేస్తున్నాడని కొందరు తెలిపారు. వ్యాపారికి తన వ్యవహారం మూడుపూవులు, ఆరుకాయలు చందాన కొనసాగుతున్నా ఏ అధికారికి తెలియక పోవడం విడ్డూరంగా ఉందని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. పైగా ఈ ఆలయానికి ఒకవైపు ప్రహరీ కూడా లేని పరిస్థితి ఉందని, ఇటువంటి తరుణంలో అమ్మవారి ఆస్తులకు దిక్కెవరనేది ప్రశ్నార్ధకంగా మారిందని, ఇప్పటికైనా ఈ వ్యవహారం (వ్యాపారం) పై అధికారులు స్పందించి. అమ్మవారి ఆలయానికి పరిరక్షణ కల్పిస్తూ .. వ్యాపారికి సహకరిస్తూ విధి నిర్వహణ సక్రమంగా లేని సిబ్బందిని, ఈ విషయాలు తెలిసి తెలియనట్లు వ్యహరిన్న కార్యనిర్వాహణాధికారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# కక్షసాధింపులు మాని ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టాలి : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, మే 20 (పెన్ సత్తా):** లిక్కర్ కుంభకోణంలో మాజీ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీ అయిన ధనుంజయ రెడ్డిని, కృష్ణమోహన్ రెడ్డి లను అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణికి అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. ఈ కేసును సిఐడి నుండి సిట్కి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. మద్యం అమ్మకాలు పెరిగినప్పుడు అవినీతి జరుగుతుందా? తగ్గినప్పుడు అవినీతి జరుగుతుందా అనే విషయాన్ని గమనించాలని అన్నారు. కేవలం జగన్మోహన్ రెడ్డి మీద కక్ష సాధింపులో భాగంగానే చంద్రబాబు ప్రభుత్వం జగన్ అనుచరులను వేధిస్తుందని గతంలో కూడా మాజీ ఐఏఎస్ అధికారులు శ్రీలక్ష్మి, బీపీ ఆచారిలను కూడా ఇదే మాదిరిగా వేధించారని అయితే వారు ఆ కేసుల నుండి క్లీన్ చిట్తో బయటికి రావడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దిరెడ్డి కుటుంబంపై అటవీ భూముల ఆక్రమణ చేశారనే ఆరోపణపై కేసుల నమోదు చేశారని తర్వాత రికార్డుల ద్వారా అవి పట్టా భూములను తేలినప్పటికీ ఆయన కుటుంబ సభ్యులపై మహిళలపై పూరిత కేసులు బనా యించారని అన్నారు. అదేవిధంగా భోగాపురంలో నిర్మించిన రిసార్ట్లో 51 ఎకరాల అటవీ భూమి ఉందని అనే వారని దాని గురించి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కుట్ర పూరిత ధోరణితో కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాం నుండి చంద్రబాబు జగన్పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని గతంలో జగన్ పై లక్ష కోట్ల కుంభకోణం అంటూ దుష్ప్రచారం చేశారని దాన్నీ రుజువు చేయలేకపోయారని అన్నారు. తర్వాత జరిగిన ఎన్నికలలో ప్రజలు 151 సీట్లు ఇచ్చి జగన్ను ముఖ్యమంత్రిని చేశారని అన్నారు. ముఖ్యమంత్రి అయిన కొద్దికాలంలోనే కరోనా కష్టకాలం మొదలైందని అయినప్పటికీ జగన్ ధైర్యంతో కష్టకాలన్నీ ఎదుర్కొని ప్రజలకు సంక్షేమ అభివృద్ధి పథకాలను ఆపకుండా వారిని ఆదుకున్నాడని అన్నారు. కరోనా సమయంలో చంద్రబాబు కనీసం రాష్ట్రంలో కూడా ఉండకుండా హైదరాబాదులోనే ఉన్నారని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇచ్చింది రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని చూసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అని అయితే ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి కక్ష పూరిత ధోరణిలో వైసీపీ నాయకులపైన గత ప్రభుత్వం లో పని చేసిన అధికారుల పైన మంత్రులపైన అక్రమ కేసులు బనాయిస్తుందని అన్నారు. ఇకనైనా కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజా సంక్షేమం పైన రాష్ట్ర అభివృద్ధి పైన దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

# దళిత వాడల అభివృద్ధి కూటమితోనే సాధ్యం



**సామర్లకోట, మే 20 (పెన్ సత్తా):** గ్రామాల్లో వెనుకబడిన దళిత వాడల అభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని, రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు నిలవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పిలుపునిచ్చారు. ఆదివారం సామర్లకోట మండలం ఉండూరు శివారు వల్లూరు గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొన్నారు. తొలుత రూ. 20 లక్షల రూపాయలు ఉపాధి నిధులతో నిర్మించిన రోడ్లు, డ్రైన్లను వారు ప్రారంభించారు. అలాగే మరో రూ. 25 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు డ్రైన్లు తదితర అభివృద్ధి పనులకు కొబ్బరి కాయలు కొట్టి, శిలాఫలకాలు ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. వల్లూరు స్మశాన వాటికకు వెళ్లేందుకు కాలువపై రూ .8.50 లక్షలతో నిర్మించిన కాలిబాట వంతెనను ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం అచ్చంపేటలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎంపీడీవో కే హిమామహేశ్వరి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనివాసు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి రాజా, బచ్చల జెమ్మి, గ్రామ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా చక్రధర రావు వర్ధంతి కార్యక్రమం




**సామర్లకోట, మే 20 (పెన్ సత్తా):** పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ నాయకులు డా. గౌరకపూడి చిన్నయ్యదొర తండ్రి అయిన గౌరకపూడి చక్రధర్రావు 15వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంపెంగ తోటలోని జిసి అపార్ట్మెంట్ వద్ద బీజేపీ నియోజక వర్గ నాయకులు డా.గౌరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన తండ్రి చక్రదరారావు జ్ఞాపకం చేసుకుంటూ ఆయన స్వగృహం నందుగల తన తండ్రి చక్రధరరావు విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆటో యూనియన్ కార్మికులకు ప్రధాని మోదీ ఫోటో ముద్రించిన టీ షర్ట్ లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట బిజెపి పట్టణ అధ్యక్షులు పుప్పాల నాగ గోవిందు, జనరల్ సెక్రటరీ జానీ మోసెస్, నాయకులు అడబాల వీరభద్రరావు (ఉపాధ్యక్షులు), బిజెపి సీనియర్ నాయకులు, వల్లూరి బుల్లియ్య, ఆటో స్టాండ్ అధ్యక్షులు డొంకిన సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 22న హనుమాన్ శోభయాత్ర బైక్ ర్యాలీ

**సామర్లకోట, మే 20 (పెన్ సత్తా):** హనుమాన్ శోభయాత్ర కమిటీ సామర్లకోట – పెద్దాపురం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ గురువారం హనుమాన్ శోభయాత్ర భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు శోభయాత్ర కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం నాయకులు మాట్లాడుతూ హనుమాన్ జన్మ దినోత్సవ సందర్భంగా 22వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు సామర్లకోట పట్టణం లోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈ భారీ బైక్ ర్యాలీని ప్రారంభించి సామర్లకోట, పెద్దాపురం పురవీధుల్లో ఘనంగా నిర్వహిం చనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది హనుమాన్ శోభాయాత్రలో శృంగవృక్షం దత్త పీఠాధిపతులు శ్రీ సాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీ విచ్చేసి పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణ చేయనున్నట్టు చెప్పారు. 8 కిలోమీటర్లు పొడవున నిర్వహించే ఈ బైక్ ర్యాలీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ వద్ద నుంచి ప్రారంభమై బ్రౌన్ పేట, బళ్ళ మార్కెట్ సెంటర్, గాంధీ బొమ్మ మీదుగా స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్దకు చేరుకుని అక్కడ నుండి మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా పెద్దాపురం పట్టణంలోనికి ప్రవేశించి




దర్గా నగర్ సెంట్రల్ వరకు కొనసాగి పాశీల వారి వీధిలోని వినాయకుని ఆలయం వద్ద ముగిస్తుందన్నారు. ఈ యాత్రలో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని హిందూ ప్రజలు, యువకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా శోబయాత్ర కమిటీ నాయకులు తెలిపారు.

# అప్పారాయుడుపాలెం పంచాయతీపై ఉన్న కోర్టు కేసును త్వరగా పరిష్కరించాలి

## - కోర్టు కేసు తేలేదు ఎప్పుడు.... పంచాయతీ అభివృద్ధి ఎలా...? - పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు పంచాయతీ సమస్యపై వినతిపత్రం

**రాంబిల్లి, మే 20 (పెన్ సత్తా):** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం గ్రామ పంచాయతి 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవుట, అభివృద్ధికి దూరంగా ఉండుడ, పంచాయతి విభజన కోర్ట్ కేసును పరిష్కరించాలని సోమవారం ఉదయం అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో పీజీఆర్ఎస్‌లోని అప్పారాయుడుపాలెం గ్రామం అలాగే భోగాపురం గ్రామం నుంచి ఉరిటి నానాజీ, నానేపల్లి సన్యాసిరావు వినతిపత్రంని ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు పంచాయతీ సమస్యలపై వివరిస్తూ మా గ్రామం 2020 వరకు పంచదార్ల గ్రామపంచాయతి పరిదిలో ఉండేది. అయితే 2020 సంవత్సరంలో గ్రామ పంచాయతిలను విబజించారు. పంచదార్ల, ధరపాలెం గ్రామాలను కలిపి పంచదార్ల గ్రామ పంచాయతిగా... అప్పారాయుడుపాలెం గ్రామం, భోగాపురం గ్రామంలను కలిపి అప్పారాయుడుపాలెం గ్రామ పంచాయతీగా విభజించారు. గ్రామ పంచాయతి కేంద్రం అయిన తరువాత అప్పారాయుడుపాలెం, భోగాపురం గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామస్తులము అందరమూ సంతోషించాము. పంచదార్ల గ్రామ పంచాయతి నుంచి పంచదార్ల మరియు అప్పారాయుడుపాలెం గ్రామ పంచాయతిలుగా విభజించుటకు గాను గ్రామ సభ, గ్రామ పంచాయతి సమావేశం నందు తీర్మానములు చేసియున్నారు (గ్రామ సభ తీర్మాణం నెం.1, తేది 27.11.2019, గ్రామ పంచాయతి ప్రత్యేక సమావేశం తీర్మాణం నెం. 1, తేది 28.11.2019) ఆమోదించి యున్నారు. తీర్మాణం






చేసిన తరువాత ఆంధ్రప్రదేశ్ పంచాయతి రాజ్ కమీషనర్ వారు పంచదార్ల గ్రామ పంచాయతిని పంచదార్ల మరియు అప్పారాయుడు పాలెం గ్రామ పంచాయతిలుగా విభజించుటకు అభ్యంతరములు ఏమైనా ఉంటే 10 దినములలోపు ఉన్నచో తెలపమని షోకాస్ నోటీసు జారి చేసియున్నారు. ఆ షోకాస్ నోటీసును జిల్లా పంచాయతి అధికారి విశాఖపట్నం వారు పంచదార్ల గ్రామ పంచాయతికి పంపియున్నారు. విస్తరణ అధికారి రాంబిల్లి వారు మరియు పంచదార్ల పంచాయతి కార్యదర్శి పంచదార్ల గ్రామ పంచాయతి నోటీసు బోర్డు నందు 10 దినములు అభ్యంతరములు స్వీకరణ కోసం ఉంచి యున్నారు. కానీ 10 దినములు తరువాత ఎటువంటి అభ్యంతరములు రాలేదు అని ధ్రువీకరించి యున్నారు. పంచాయతి విభజనకు పంచదార్ల మరియు అప్పారాయుడుపాలెం గ్రామాలకు 3 కి.మీ. దూరం ఉంది అని అప్పటి యలమంచిలి అసిస్టెంట్ ఇంజనీర్ (రోడ్స్ & బిల్డింగ్స్) ధ్రువీకరించారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ పంచాయతి రాజ్ ప్రిన్సిపాల్ సెక్రెటరి G.O.M.S.No. 186 Dt. 13-01-2020 ద్వారా పంచదార్ల గ్రామ పంచాయతి నుండి అప్పారాయుడుపాలెం గ్రామ పంచాయతి వేరు చేస్తూ జిఓ కూడా విడుదల చేసారు. అప్పటి నుండి అప్పరాయుడుపాలెం కొత్త గ్రామ పంచాయతిగా ఏర్పడింది. అయితే పంచాయతి ఎన్నికలు దగ్గర పడినప్పుడు పలు రాజకీయ కారణాలతో పంచదార్ల గ్రామ పంచాయతిని విభజించటం ఇష్టం లేని కొందరు గ్రామ పంచాయతి విడిపోకుండా ఉండాలి అని హైకోర్ట్ నందు కేసు వేసియున్నారు. హైకోర్ట్ నందు కేసు వెయ్యటం వలన పంచాయతి ఎన్నికలు పంచదార్ల మరియు అప్పారాయుడు పాలెం గ్రామ పంచాయతి ఎన్నికలు జరగలేదు. పంచాయతి ఎన్నికలు జరగక పోవటం వలన 15వ కేంద్ర ఆర్ధిక సంఘం నిధులు రెండు గ్రామ పంచాయతీలకు నిలుపుదల చేసియున్నారు. ఈ నాలుగు సంవత్సరములలో కనీసం ఒక గ్రామ పంచాయతి సంవత్సరమునకు 7 లక్షలు రూపాయలు చొప్పున ఈ 4 సంవత్సరాలకు 56 లక్షలు నష్టపోయి కనీస అభివృద్ధికి నోచుకోకుండా పోయిందని తెలిపారు. సంవత్సరమునకు ఇంటి పన్నులు రూపంలో వచ్చే లక్ష రూపాయలు కనీసం పరిసుధ్య పనులు చేసే స్వీపర్ లకు కూడా సరిపోవడం లేదు. గ్రామ పంచాయతిలో వీధీ దీపాలు, నిర్వహణ, సిసి చార్జీలు, డ్రైనేజ్‌లో పుడిక తీయుట, త్రాగునీరు సరఫరా మొదలగు పనులకు ఒక రూపాయి కూడా ఉండుట లేదు. దీనివలన గ్రామ పంచాయతి అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయింది. గ్రామస్తులము అందరమూ కూడా గ్రామ పంచాయతి నిధులు లేక ఏమి చేయలేని స్థితిలో ఉన్నాము. కోర్ట్ కేసు పరిష్కారం భాగంగా కాని యెడల వచ్చే సంవత్సరంలో జరగబోయే పంచాయతి ఎన్నికలు కూడా జరిగే వీలు లేకుండా పోతుంది. కేంద్ర ఆర్ధిక సంఘం నిధులు కూడా వచ్చే సూచనలు ఉండవు. పంచాయతి అభివృద్ధి జరిగే పరిస్తితి కూడా ఉండదు. 4 సంవత్సరాలుగా ఉన్న కోర్ట్ కేసును ఎవరు పట్టించుకోవటం లేదు దయ చేసి ఈ కోర్ట్ కేసు ను పరిష్కరించి గ్రామ అభివృద్ధికి సహకరించగలరని అప్పారాయుడుపాలెం, భోగాపురం గ్రామస్తులు అందరూ వినతి పత్రం ద్వారా కోరినట్టు తెలిపారు.

# స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**నరసాపురం, మే 20 (పెన్ సత్తా):** మంగళవారం నరసాపురం మండలం పలు గ్రామాలలో స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తున్న యూనిట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్వేశ్వరం గ్రామంలో పిండి వంటలు స్వీట్లు తయారు చేసి యూనిట్, సార్వ గ్రామంలో మినీ డైరీ యూనిట్, తూర్పుతాళ్లలో ఫ్లోర్ మిల్లు పచ్చళ్ళు తయారు చేసే యూనిట్, చామకూరి పాలెంలో డొక్క తాడు పరిశ్రమను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయిలో పరిశీలించి, యూనిట్ నడిపే వారి సభ్యులతో మాట్లాడారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మీ పిల్లలు ఏమి చదువుతున్నారు, ఏమి పనులు చేస్తారని ఆరా తీశారు. మీరు తయారు ఐటమ్స్, మార్కెట్ ఏ విధముగా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. స్వశక్తితో నిలబడేందుకు బ్యాంకు రుణాలు బ్యాంకు లింకేజీ సి ఐ ఎఫ్, స్త్రీ నిధి, పీఎం ఈజీ ఏపీ, తదితర ప్రభుత్వ



బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ దాసిరాజు, డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తాహసిల్దార్ అయితం సత్యనారాయణ, ఏపిఎం నాగభూషణం నాయుడు, సీసీలు, సిబ్బంది ఉన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా అన్న క్యాంటీన్‌లో ఉచిత భోజనం



**మే 20 (పెన్ సత్తా):** జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా అన్నా క్యాంటీన్లో ఈరోజు మధ్యాహ్నం భోజనానికి క్యాంటీన్‌కి డబ్బులు చెల్లించి ఉచితంగా భోజనాన్ని ఏర్పాటు చేశామని పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు తెలియజేశారు. ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా జూనియర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, అలాగే ఈ సంవత్సరం ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు రొట్టి పాలు పంపిణీ చేశామని ఫాన్స్ సినిమాలకే కాకుండా సేవా కార్యక్రమంలో కూడా ముందు ఉం టున్నామని పట్టణంలో బాలకృష్ణ ఫ్యాన్స్ బస్సు షెల్టర్ చోడవరం రోడ్డు అలాగే సత్యనారాయణ థియేటర్ దగ్గర బస్సు తన సొంత నిధులతో ఏర్పాటుచేసి ప్రయాణికులకు నీడ కల్పించామని కీర్తిశేషులు నందమూరి తారక రామారావు బాలకృష్ణ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేయడం మా ఫ్యాన్స్ అందరికీ చాలా సంతోషంగా ఉందని నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కరణం శ్రీనివాసరావు దూలం ప్రసాద్ విల్లూరి అప్పలనాయుడు బొడ్డేడ గిరీష్ ఈశ్వర్ మద్దాల భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఛార్జీలపై మెట్రో తాజా నిర్ణయం ఇదే




**హైదరాబాద్, మే 20 (పెన్ సత్తా):** మెట్రో ఛార్జీల విషయంలో ఎల్ అండ్ టీ సంస్థ దిగొచ్చింది. ప్రస్తుతం పెంచిన ఛార్జీలలో 10 శాతం రాయితీని ప్రకటిస్తూ ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24వ తేదీ నుంచి ఈ రాయితీలు వర్తించనున్నాయని సంస్థ ప్రకటించింది. కాగా.. మెట్రో కనీస ఛార్జీలు రూ.10 నుంచి రూ.12కు, గరిష్ఠ ఛార్జీలు రూ.60 నుంచి 75కు పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో సంస్థ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఛార్జీలు ఎక్కువగా పెరిగిన నేపథ్యంలో ప్రయాణికుల నుంచే కాకుండా ప్రతిపక్షాలు, వామపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కూడా పెరిగిన మెట్రో ఛార్జీల విషయంలో ఆలోచించాలని ఎల్ అండ్ టీ సంస్థను కోరింది. ఈక్రమంలో ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను యాజమాన్యం సవరించింది. గత మూడు రోజులుగా పెరిగిన ఛార్జీలు అమలులోకి వచ్చాయి. తాజాగా పెరిగిన ఛార్జీల మొత్తంపై పది శాతం రాయితీ ఉంటుందని ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించడంతో.. ప్రయాణికులకు కాస్త ఊరట లభించినట్లైంది. నిత్యం హైదరాబాద్ మెట్రో ద్వారా దాదాపు 5 నుంచి ఐదున్నర లక్షల మంది ప్రయాణికులు వారి వారి గమ్యస్థానాలకు చేరుతూ ఉంటారు. దాంతో పెరిగిన ఛార్జీలు ప్రయాణికులపై అదనపు భారం పడినట్లైంది. ఛార్జీల పెంపుపై ప్రయాణికులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎల్ అండ్ టీ సంస్థ పెరిగిన ఛార్జీలపై పునరాలోచన చేసి.. పెంచిన ఛార్జీలపై పది శాతం రాయితీ ప్రకటించింది. మెట్రో సంస్థ నిర్ణయంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో మొత్తం మూడు కారిడార్‌లో ముఖ్యంగా మియాపూర్ నుంచి ఎల్బీనగర్ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. అటు నాగోల్ నుంచి రాయదుర్గం మార్గంలో కూడా విపరీతంగా రష్ ఉంటుంది. ఈ రెండు మార్గాల్లో లాభాలు ఉన్నప్పటికీ జేబీఎస్, ఎంజీబీఎస్ మార్గం మాత్రం పూర్తిగా నష్టాల బాటలో నడుస్తోంది. ఈ క్రమంలో నష్టాల నుంచి గట్టెక్కేందుకు మాత్రమే ఛార్జీల పెంపు అనివార్యమైందే తప్ప ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం, ప్రయాణికులపై అదనపు భారం వేయడం తమ ఉద్దేశం కాదని మెట్రో సంస్థ ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలను కూడా పరగణలోకి తీసుకుని పెరిగిన ఛార్జీలపై దాదాపు పదిశాతం రాయితీ ఇస్తూ ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ నిర్ణయం తీసుకుంది.

# లేసు అల్లికదారులు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలి

## - లేసు అల్లికలలో వినియోగదారులు అభిరుచికి అనుగుణంగా కొత్త డిజైన్లు రూపొందించాలి : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**నరసాపురం, మే 20 (పెన్ సత్తా):** మంగళవారం నరసాపురం మండలం రుస్తుంబాధ అలంకృతి లేసు పార్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుచున్న డిజైన్ వర్క్ షాప్‌లో పాల్గొని లేస్ అల్లికల మీద శిక్షణ పొందుచున్న మహిళలు అల్లిన పలు విధాల లేసు డిజైన్లను ఆమె పరిశీలించారు. లేస్ అల్లికల శిక్షణ పొందే మహిళలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో మాట్లాడి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ లేసు అల్లికలలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని అన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా కొత్త డిజైన్లను రూపొందించాలని అన్నారు. ప్రత్యేకించి గృహాలలో అలంకరించుకునే లేస్ డిజైన్లను, టేబుల్ పై వేసుకునే డిజైన్లు, పిల్లలు, మహిళలు, ధరించే లేస్ డిజైన్లపై ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు. అల్లిన లేసు దుస్తులను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. తద్వారా ఇక్కడ కంటే మార్కెట్లో రేటు ఎక్కువ రేటు లభిస్తుందని అన్నారు. లేసు అల్లిక మహిళలు ఆర్థికగా బలపడేందుకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. కుట్టు డిజైన్ అల్లికలలో మహిళలు ఎక్కువగా డిజైన్ అల్లికలలో పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకోనీ మంచి మంచి ప్రోడక్ట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహసిల్దార్ అయితం సత్యనారాయణ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, లేసు శిక్షణ మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తారక్ @ 2025.. ఈ బర్త్ డే ఎందుకంత స్పెషల్?



జూనియర్ ఎన్టీఆర్.. బాల నటుడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి.. అంచలంచెలుగా ఎదిగి పాన్ ఇండియా స్టార్ హీరోగా మారిన విషయం తెలిసిందే. తాత స్వర్గీయ సీనియర్ ఎన్టీఆర్‌కు తగ్గ మనవడిగా ప్రూవ్ చేసుకున్నారు. భారీ డైలాగ్స్, డ్యాన్స్, యాక్షన్ సీక్వెన్సెస్, ఎమోషనల్ సీన్స్.. ఎందులో అయినా తోప్ అని నిరూపించుకున్నారు. క్లాస్ మాస్ అంటూ తేడా లేకుండా దూసుకుపోతున్న జూనియర్ ఎన్టీఆర్ నేడు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. దీంతో ఆయనకు సినీ ప్రియులు, సెలబ్రిటీల నుంచి బర్త్ డే విషెస్ వెల్లువెత్తుతు న్నాయి. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు కనిపిస్తు న్నాయి. అయితే ఈ బర్త్ డే ఆయనకు చాలా స్పెషల్ అని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఎందుకంటే 2025లో ఆయన సినీ కెరీర్ స్టార్ట్ చేసి 25 ఏళ్లు పూర్తి కానుంది. అంటే సిల్వర్ జూబ్లీ జరుపుకోనున్నారు.

అదే సమయంలో ఇప్పుడు బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఆయన యాక్ట్ చేస్తున్న వార్–2 మూవీ.. ఆగస్టు 14వ తేదీన హిందీ, తెలుగు, తమిళంలో విడుదల కానుంది. ఇప్పటికే టీజర్‌లో పవర్ ఫుల్‌గా కనిపించారు. అయితే ఇప్పటికే ఆర్ఆర్ఆర్ వంటి సినిమాల డబ్బింగ్ వెర్షన్లతో తారక్.. బాలీవుడ్‌లో సందడి చేశారు. కానీ స్ట్రయిట్ హిందీ మూవీ చేయాలని ఫ్యాన్స్ ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. తన సత్తా ఏంటో నిరూపించుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇప్పుడు వార్ 2తో అది నెరవేరనుంది. ఆ మూవీపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు తెలుగు స్టార్ హీరోలు.. బాలీవుడ్ డెబ్యూ సినిమాలు చేసినా అనుకు న్నంత స్థాయిలో మెప్పించలేకపోయారు. కానీ ఇప్పుడు యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న వార్–2.. క్రేజీ కంటెంట్, స్టైలిష్ యాక్షన్, భారీ బడ్జెట్ తో స్పై థ్రిల్లర్ గా సందడి చేయనుంది. కచ్చితంగా మూవీ హిట్ అవుతుందని అంతా అంచనా వేస్తున్నారు.

కాబట్టి వార్–2 హిట్ అయితే నార్త్‌లో తారక్ కు ఉన్న క్రేజ్ పీక్స్‌కు చేరుతుంది. అదే సమయంలో అందరి లానే తన కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఆయన.. ఒకానొక సమయంలో వరుస ఫ్లాపులు అందుకున్నారు. కానీ టెంపర్‌తో హిట్ ట్రాక్ ఎక్కి ఇప్పటి వరకు వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇప్పుడు వార్–2తో తన హిట్ ట్రాక్‌ను కంటిన్యూ చేస్తే వేరే లెవెల్. మరి ఆయన ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# నీతా అంబానీ సరసన రామ్ చరణ్ అత్తగారు!



కేవలం భార్యగా ఉండటం వేరు.. వ్యవస్థాపకురాలిగా, సామాజిక వేత్తగా ఇతరులకు ఆదర్శంగా ఉండటం వేరు. ఈ రెండు లక్షణాలతో ఉపాసన కొణిదెల ఎప్పుడూ షైనింగ్ స్టార్ గా పేరు తెచ్చుకున్నారు. ఓవైపు రామ్ చరణ్ భార్యగా, ఎంటర్ ప్రెన్యూర్‌గా, సామాజిక సేవికురాలిగా ఉపాసన కొణిదెల నిరంతరం మీడియా హెడ్ లైన్స్‌లో నిలుస్తున్నారు. అయితే ఉపాసన లాంటి యంగ్ ఎంటర్ ప్రెన్యూర్‌కి ఈమాత్రం గుర్తింపు, హోదా సరే కానీ, ఇప్పుడు ఉపాసన కొణిదెల మాతృమూర్తి సాధించిన ఘనత గురించి ఎందరికి తెలుసు? ఉపాసన కామినేని మాతృమూర్తి శ్రీమతి శోభన కామినేని (రామ్ చరణ్ అత్తగారు) సాధించిన ఘనత ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఉపాసన ఇటీవల సోషల్ మీడియాలో 2025 అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాను షేర్ చేసారు. ఇందులో నీతా అంబానీ, ఇషా అంబానీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వంటి దిగ్గజాలు పేర్లు ఉన్నాయి. వారితో పాటు, జాబితాలో మూడవ పేరుగా తన తల్లి శోభన కామినేని పేరు నిలిచిందని ఉపాసన గర్వంగా చెప్పారు. ఇది నిజంగా గర్వకారణం. ఈ సందర్భం గర్వించదగినదే కాదు.. భావోద్వేగాన్ని రేకెత్తించేది అని తెలిపింది. ఆరోగ్య సంరక్షణ రంగంలో శక్తివంతమైన మహిళగా, వన్యప్రాణుల సంరక్షణలో బలమైన స్వరం వినిపిస్తున్న నేటి మహిళగా శోభన కామినేనికి సంఘంలో గొప్ప గుర్తింపు ఉంది. అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ గాను ఎప్పుడూ బిజీగా ఉండే పర్సనాలిటీ.. మహిళల ఆరోగ్య సంరక్షణ గురించిన ఆలోచ నలు, సేవలతోను సమాజంలో ఉన్నత స్థానాన్ని అందు కున్నారు. ఈ ప్రయాణం అంత సులువైనది కాదు. ఆమె నిరంతర కృషి, పట్టుదల, సృజనాత్మకతకు నిదర్శనం. తన తల్లి అద్భుత ప్రయాణాన్ని కుమార్తె ఉపాసన ఎంతగానో గౌరవిస్తారు. అందుకే తన తల్లి బాటలోనే ఉపాసన కూడా సామాజిక ధృక్పథంతో ఎంతో ఉన్నత స్థానానికి ఎదుగు తున్నారు. ర్యాంకుల కంటే శక్తివంతమైన మహిళగా తన తల్లి సాధించినది ఎప్పుడూ పదిమంది ఎంటర్ ప్రెన్యూర్‌లకు స్ఫూర్తినిస్తూ ఉంటే అది ఇంకా ఆనందాన్నిస్తుందని ఉపాసన చెబుతారు.

# ఐపీఎల్ మ్యాచ్ వేదికల్లో మార్పు.. ఫైనల్స్ అక్కడే! కారణం ఇదే..




ఐపీఎల్–2025 క్రమంగా ఆఖరి అంకానికి చేరుకుంటోంది. ప్రతి జట్టు దాదాపుగా 12 మ్యాచులు ఆడాయి. ఈ వారంతో గ్రూప్ దశ నుంచి ప్లేఆఫ్స్‌కు టర్న్ తీసుకోనుంది క్యాష్ రిచ్ లీగ్. ఈ తరుణంలో వేదికలపై క్లారిటీ ఇచ్చింది భారత క్రికెట్ బోర్డు. ప్లేఆఫ్స్, ఫైనల్ మ్యాచ్ వేదికలపై తేల్చేసింది. ముల్లాన్ పూర్, అహ్మదాబాద్‌లో 4 ప్లేఆఫ్స్ మ్యాచులు నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. మే 29న జరిగే క్వాలిఫయర్ 1, ఆ తర్వాతి రోజు జరిగే ఎలిమినేటర్ మ్యాచులకు ముల్లాన్‌పూర్ ఆతిథ్యం ఇవ్వనుందని బీసీసీఐ వెల్లడించింది. జూన్ 1న జరిగే క్వాలిఫయర్ 2తో పాటు జూన్ 3న జరిగే ఫైనల్ ఫైట్‌కు అహ్మదాబాద్ హోస్ట్‌గా వ్యవహరిస్తుందని ప్రకటించింది.

**ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్!**

ప్లేఆఫ్స్, ఫినాలేతో పాటు లీగ్ దశలో భాగంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే మ్యాచ్ వేదికనూ బీసీసీఐ మార్చేసింది. వర్షం ముప్పు ఉండటంతో ఈ పోరును బెంగళూరు నుంచి లక్నోకు తరలించింది బోర్డు. ఆరెంజ్ ఆర్మీతో మ్యాచ్ తర్వాత మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది ఆర్సీబీ. అందుకే ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్‌ను కూడా అక్కడికి షిఫ్ట్ చేసినట్లు తెలుస్తోంది. మొత్తానికి గ్రూప్ దశ మ్యాచుల ముగింపు సమయంలో ప్లేఆఫ్స్, ఫైనల్స్ వేదికలపై క్లారిటీ ఇవ్వడం మంచి విషయమే. పాత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతాలో ప్లేఆఫ్స్, ఫైనల్ మ్యాచుల్ని ప్లాన్ చేసింది బీసీసీఐ.

కానీ ఇండియా–పాకిస్థాన్ నడుమ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతను దృష్టిలో పెట్టుకొని వేదికల్ని మార్చేసింది బోర్డు. కాగా, సన్‌రైజర్స్ వైఫల్యంతో బాధలో ఉన్న ఫ్యాన్స్‌కు.. ప్లేఆఫ్స్ మ్యాచుల్ని హైదరాబాద్ నుంచి మరో సిటీకి మార్చడం బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి.

# కోహ్లీ మళ్లీ కనపడడు.. రవిశాస్త్రి సంచలన వ్యాఖ్యలు!




ఎంతటి గొప్ప క్రికెటర్ అయినా ఎప్పుడో ఒకప్పుడు రిటైర్ అవ్వాల్సిందే. అయితే తమ అభిమాన ఆటగాడు ఇక బరిలోకి దిగడు అనే విషయాన్ని ఫ్యాన్స్ జీర్ణించుకోలేరు. మరీ ముఖ్యంగా ఇంకొన్నాళ్లు ఆడే సత్తా ఉన్నా, ఫామ్–ఫిట్‌నెస్ పరంగా ఢోకా లేకున్నా ప్లేయర్లు అర్ధంతరంగా నిష్క్రమిస్తే అభిమానులు అస్సలు ఒప్పుకోరు. టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విషయంలో అదే జరుగుతోంది. టెస్టుల నుంచి అతడు ఉన్న పళంగా రిటైర్ అవడాన్ని ఫ్యాన్స్ తట్టుకోలేకపోతున్నారు. మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు కూడా విరాట్ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. రిటైర్‌మెంట్ మీద వెనక్కి తగ్గాలని కోరుతున్నారు. ఈ విషయంపై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. ఆ రోజు నుంచి కోహ్లీ ఎవరికీ కనపించడంటూ బాంబు పేల్చాడు. అతడు ఇంకా ఏమన్నాడంటే..

**నో కోచింగ్.. నో కామెంట్రీ!**

టీమిండియాకు సేవలు అందించేందుకు కోహ్లీ ఎప్పుడూ అందుబాటులో ఉంటాడని రవిశాస్త్రి తెలిపాడు. టీ20లు, టెస్టులకు గుడ్‌బై చెప్పినా.. వన్డేల్లో అతడు ఆడతాడని చెప్పుకొచ్చాడు. క్రికెట్ నుంచి పూర్తిగా రిటైర్ అయ్యేంత వరకు అతడు భారత జట్టుకు అందుబాటులో ఉంటాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. అయితే ఒక్కసారి ఆట నుంచి రిటైర్ అయితే మాత్రం పూర్తిగా దూరమవుతాడని.. ఎవరికీ కనిపించడన్నాడు. కోచ్ లేదా కామెంటేటర్‌గా పని చేసే వ్యక్తిత్వం అతడిది కాదన్నాడు. రిటైర్ అయ్యానంటే ఆటకు పూర్తిగా దూరంగా ఉంటానని, కొన్నాళ్ల పాటు ఎవరికీ కనిపించనంటూ గతంలో కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు రవిశాస్త్రి కూడా అలాంటి కామెంట్స్ చేశాడు. దీంతో వన్డే రిటైర్‌మెంట్ తర్వాత విరాట్ ఎవరికీ కనిపించకుండా పోతాడేమోనని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఏదో ఒక విధంగా క్రికెట్‌తో అతడు సంబంధాలు కొనసాగించాలని, కోహ్లీని స్టేడియంలో చూడకుండా ఉండలేమని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

"PEN SATTA" Telugu Daily Printed, Published & Owned by : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Published at D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021. and Printed at Chaitanya Varadhi Printers, D.No. 2-99, Bharanikam, Parawada, VISAKHAPATNAM-531021, Editor : **CHINTAMANENI ANIL KUMAR,** D.No.1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531021, Cell : 98853 15759, RNI No.APTEL/2023/87729, Email : anilchintamaneni@gmail.com